కథా నిలయం
శ్రీకాకుళం

# పొన్న

సాయంకాలపు వేళ.

కార్తీకమాసపు తొలి దినాలలో గాలులు చలిగా వీస్తున్న వేళ; పొన్నచెట్టు క్రింద పూరింటి ముందు సైకిలాగింది.

చెట్టుమీద నున్న తమ గూళ్ళను చేరుకుని గోల పెడుతూ తమ కష్టసుఖాలను చెప్పుకుంటున్న కాకులొక్కసారి నోళ్ళు కట్టుకున్నాయి. కారణమేటిదో తెలిసికోలేని చిన్న కాకులు, పెద్దకాకుల వైపు కళ్ళింతలు చేసుకుని చూశాయి.

కాకులన్నీ సైకిలు వైపే చూస్తున్నాయి. సైకిలు దిగుతున్న అతనినేచూస్తున్నాయి. అతనిని చూస్తూ గుమ్మంముందు నిలబడి స్వాగత మివ్వనున్న ఆమెనేచూస్తున్నాయి. ఆ పూరింటి ముందున్న ఆమెనేచూస్తున్నాయి. ఆమెను చూస్తున్న అతనినే చూస్తున్నాయి. చూపులు మార్చుతూ ఆ ఇరువురినే చూస్తున్నాయి

సైకిలుకు స్టాండు వేశాడతను. ఆమె ఆశ్చర్యానందాలతో రెండడుగులు ముందుకు వేసింది.

పెద్ద కాకులు "కావు కావు" మన్నాయి. చిన్న కాకులు వానిని అనుసరించాయి.

కాకులు అరవటం ఆమె విన్నది. కాని ఆమెకు వాటి భాష తెలియక కాబోలు అలానే నిలుచుండి పోయింది. అతన్ని చూడగానే ఆమె కళ్ళలో మెరసిన కాంతులనా కాకులు గమనించక పోయి వుండవచ్చు.

అతను ఆమెతో పాటు గుమ్మందాటి ఇంటిలోకి వెళ్ళాడు. కాకులు అరవటం మానేశాయి. నాలుగు పెద్దకాకులు నలుదిశల ఎగిరి పోయాయి. ఇంటి ఎడిసెత్తిని ఉన్న పురిసి పీకి కన్నం చేయాలనే కార్యక్రమాన్ని వాయిదా వేసికున్నందుకు నాలుగు పెద్దకాకులు ఒకదాని నొకటి నిందించుకున్నాయి. ఆశావాదులయిన మరి రెండు పెద్దకాకులు చీకటిలో కళ్ళను చించుకు చూడసాగాయి

ఇంటిలో నుండి వచ్చే మాటలను వినాలనే తాపత్రయంలో పడిపోయాయి పెద్దకాకులు.

చెట్టుమీద నిశ్శబ్దత ఆవరించింది.

పిల్లకాకులు ఆటలు మరచిపోయాయి.

పెద్దకాకులు గుసగుసలు విపసాగాయి.

అతనెప్పుడు వస్తాడా అని ఎదురు చూడసాగాయి. అతని వెంట ఆమె వస్తుందని వాటికి తెలుసు.

కాని కొన్ని యుగాలు గడచినా అతను రాలేదు.

ఆ సమయంలో ఎన్నో పొన్న పూలు, మొగ్గలు నేలను వడ్డాయి. అవి స్వేచ్ఛగా చేసిన ధవళ దరహాసాల్ని చూచి కళ్ళు, ముక్కులు చిట్లించు కున్నాయి కాకులు. ఒక కాకి విరిసిన పువ్వుతో గుసగుస లాడింది. వినలేక పోయింది పువ్వు. బాధతో ముఖం దాచుకుంది. దురుసుగా రెక్కలు టపటప లాడించి పువ్వు నొక

తోపుతోసి ప్రక్కల ఎగిరి పోయింది కాకి. పువ్వు నేలను రాలింది. అతను ఇవతలకి వచ్చాడు. ఆమెకూడ అతని వెనుక వచ్చింది. గుసగుస లాగిపోయాయి. అన్ని చెవులు వారిపై పే తిక్కిగాయి.

"మీరు మరీ మాట వినకుండ పోతున్నారు డాక్టరుబాబూ!"

"నన్నేం చేయమన్నావు హొన్నా? వెళ్ళకుండా ఎలా ఉండి పోగలను?"

"మిమ్మల్ని రోజుల తరబడి ఉండ మన్నానా? గంటలకొలదీ ఉండి పోమన్నానా?....ఒక గంట....ఒకే గంట.... ఉండి....మరీ వెళ్ళమంటున్నాను...."

"ఛ! ఎందుకీ కన్నీరు?"

"అవును ....నాకన్నీరే కనిపిస్తుంది. కాని మీకు నా బాధ ఎలా తెలుస్తుంది?"

"తెలుసు హొన్నా. బాగా తెలుసు."

"తెలుసును కాబట్టేకదూ నన్నింత బాధ పెడుతున్నారు.?"

"నిన్ను బాధపెట్టకూడదనే బాధపడుతున్నాను. కాని ఇది కూడ నిన్ను బాధపెడుతుందంటే నేనేం చేసేది?"

"మాటలతోనే యుగాలు గడుపుతున్నారు. కొద్దిగా లోపలికి రలండి. నా మాట వినరూ?"

వెనుతిరిగాడతను. అతని ప్రక్కనే సంతోషంతో కదిలిందామె.

ఆ చీకటిలో చేయి చేయి కలిసినదీ లేనిదీ తెలియక కించ పడ్డాయి కాకులు.

మాసిన చీరకైనా ఆమె ఒంటిమీదకు చేరగానే ఆ మెరుపు లెలా వస్తాయో తెలియలేదాక కాకికి.

పెరటిలోని కంచె మీద ఆరే ఆ చీరాజాకెట్టులకు అంత హొందిక, ఆ పుష్టి, ఆ ఒయ్యారం ఎలావచ్చాయో అర్థం కాలేదాక కాకికి.

పొదపైన ఆ జడను చూచి ఈసుపడిందామె నెచ్చెలి.

ముందుకు అడుగు వెయ్యబోయి; కాలి క్రింద పడనున్న పొన్న పూవు నందుకుని ఆమె చేతికందించాడతను.

నవ్వుతూ తలలో తురుముకుందామె.

కాకుల కళ్ళు భగ్గుమన్నాయి.

'మొగుడ్ని విడిచిన దానికెందుకో ఇంత కులుకు?' అనుకున్నాయి. "మీరలా మంచం మీద సాగోరండి డాక్టరు బాబూ! నేనొక్క క్షణంలో వచ్చేస్తాను" అంటూ దీపం పెద్దది చేసి పెరటిలోకి వెళ్ళిపోయిందామె.

బట్టలు తీయబుద్ధి కాలేదతనికి. మంచంమీద మేను చేరవేసి తలక్రింద చేతుల నుంచుకుని కళ్ళుమూసుకున్నాడు.

అలా శరీరం మంచం మీదకు వాలగానే చల్లని నీడ క్రింద చేరినట్లయిందతనికి. కొద్దిసేపలా ఉంటే బాగుంటుంది; విశ్రాంతి దొరుకుతుందని పించిందతనికి. అలసటకు వాలిన కళ్ళు మగతగా వాలాయి. చిన్న మగత నిద్ర. అదెంతసేపో గుర్తుకురాలేదతనికి.

అంతలో మెలుకువ వచ్చిందతనికి.

మైళ్ళకొలది నడిచి, అలసిపోయిన కాళ్ళు, పాదాలు మెత్తని చేతులతో లాలించబడుతున్నాయి. కళ్ళు తెరచిచూశాడు. మెత్తని చేతులతో పాదాలు వత్తుతోంది పొన్న.

"పొన్నా! ఏమిటిది?" కాళ్ళను దగ్గరకు లాక్కున్నాడు.

"ఏం తప్పా?"

"తప్పు కాదా! నా కాళ్ళను నీవు పట్టుకోవచ్చా? అదీగాక ఎవరైనా చూస్తే?

"ఊ....చూస్తే"

"నీకు తెలియదు పొన్నా !"

"అవును. నాకు తెలియదు.... నాకేమీ తెలియదు.... నాకేం తెలుసు? మీరు మా కాళ్ళు పట్టుకోవచ్చు. మా పుళ్ళను కడుగవచ్చు. చీమూ, నెత్తురును అసహ్యహించుకోకుండా తుడవ వచ్చు. చిక్కి శల్యమై పోతున్న రోగుల శరీరాలను అసహ్యా హించు కోకండ మీ చేతులతో తాకవచ్చు. రోగుల బాధలే మీ బాధలని వాళ్ళకోసం మైళ్ళకొలది పల్లె నుండి పల్లెకు పోవచ్చు. తిండి తిప్పలు లేక తిన్నావా? వస్తున్నావా? అని అడిగేవారు లేక అలమటించవచ్చు, మా కోసం, మాలాంటి వాళ్ళకోసం. కాని నేను మీ కాళ్ళు పట్టుకో కూడదు. భోజనం చేశారా అని అడగ కూడదు. నా చేత్తో, పట్టెడన్నం పెట్టకూడదు. అంతేకదూ?" ఆమె కళ్ళలో నీళ్ళు నిండాయి. ఆ కళ్ళతో అతన్ని చూడలేక పోయింది. మంచం పట్టెమీద తల వాల్చుకుని ఉండి పోయింది.

ఆమె ఏడుస్తోందని తెలిసికోవటానికి ఎక్కువకాలం పట్ట లేదతనికి. ఆమె తలకు దగ్గరగా జరిగాడు. పొన్న పూవు అతని వైపు అమాయకంగా చూస్తోంది.

"పొన్నా!....ఇదిగో ఒక్కసారి తల ఎత్తిచూడవూ?.... నిన్నే....పోనీలే.... ఇలాంటి మాటలనటానికే కదూ ఒక గంట ఉండమన్నావు? చెప్పు."

త్రుళ్ళిపడి లేచింది. "లేదు....లేదు" అంటూ పెరటివైపు పరుగెత్తింది. ఆమె ఎందుకంత అకస్మాత్తుగా లేచివెళ్ళిపోయిందో అతనికి అర్థంకాలేదు. అంతలోనే తిరిగి వచ్చింది. "రండి" అంటూ.

"వేడినీళ్ళు పెట్టాను. స్నానం చెయ్యండి. ఒళ్ళు నొప్పులు పోతాయి. ఎన్ని మైళ్లు నడచి వచ్చారో?"

అతను సంశయించే లోగా ఆమె అంది. "బట్టలు మార్చు కోండి. ఇదిగో తువ్వాలు" అతను కాదన లేక పోయాడు.

అతను స్నానం చేసి వచ్చేలోగా భోజనం సిద్ధపరచిందామె. 'ఇవ్వాళ నాకెంత సంతోషంగా ఉందో తెలుసా? ఇన్నాళ్ళకి ఈ రోజున మీరు నా మాట విన్నారు....ఎందుకంత తొందర....నెమ్మదిగా భోజనం చెయ్యండి...సైకిలుందిగా....ఎందుకు నడిచారు?"

"సగం దారి కెళ్ళేసరికి సైకిలు టైరు పంచరైంది. తిరుగు ప్రయాణంలో గాని బాగుకాలేదు"

"అన్నం వెయ్యనా?"

"ఊహూ!"

"కొద్దిగా"

"చాలు, చాలు, ఇప్పటికే చాల ఎక్కువ వేశావు"

"ఫరవాలేదు, అన్నం కలపండి, రాత్రివేళ పెరుగు వేసికో కూడదు. మజ్జిగ వేస్తాను. కలపండి"

"అదేమిటి ఉప్పును దీపానికి చూపిస్తావేం?"

"మీ ఆయుష్షు పెరగాలని"

"పిచ్చి"

"అనుకోండి"

"ఇకనైనా లేవచ్చా?" అంటూ పీటమీద నుండి లేచిపోయాడు. టవలుతో చేతులు తుడుచుకుంటూంటే "కాళ్ళు నొప్పిగా ఉన్నాయి కదూ!" అని అడిగింది పొన్న.

"నాకే కాళ్ళ నొప్పిలేదు. నీవు మాత్రం కాళ్ళు పట్టుకోకు" పాదాల దగ్గర కూర్చున్న ఆమె నుండి పాదాలు లాక్కుని నిల్చున్నాడు.

"పోనీలెండి" అంటూ దూరంగా జరిగి నిలబడి పోయింది.

"ఇక వెళ్ళనా?"

"వెళ్ళవచ్చు. కాని రోజూ ఇలా భోజనానికి వచ్చేయ కూడదూ?"

"ఎందుకు?"

"రాత్రి ఏ పది గంటలకో వంట మొదలు పెడతారు. ఏ అర్థరాత్రికో భోజనం చేశాననిపిస్తారు. నాకు బాధగా ఉంటుంది."

"నాకు అలవాటేగా"

"మంచి అలవాటు కాదది"

"మరి నే వెళ్తాను, చెరువు దాటితేనే గాని ఊరురాదు."

"తోడురానా?" అడిగింది.

"ఈ దారి నాకలవాటే" గుమ్మం వైపు నడిచాడు.

"రాత్రి కేంపు కెట్టైనా వెళ్ళాలా?" అడిగింది.

"కేసులుంటే........"

"అర్థరాత్రయినా భోజనముండదన్న మాట. అంతేకదూ?"

"నాకలవాటేగా" సైకిలందుకుంటూ అన్నాడు.

"మంచి అలవాటే" ఇద్దరూ చెట్టు క్రిందికి వచ్చారు.

అతను ముందుకు నడుస్తూ "వస్తాను" అన్నాడు.

కాకులింకా నిద్రపోలేదు "రేపురావాలి" అందామె.

"చూద్దాం"

"అలాకాదు. తప్పకరావాలి"

"మరి వెళ్ళాను" అంటూ సైకిలెక్కాడు. సైకిలు ముందుకి సాగింది. చీకటిలో అతను కనిపించేంతవరకు చూస్తూ ఉండి పోయింది. అతను వెన్ను తిరిగి చూశాడు.

ఆమె అలాగే నిల్చుని ఉంది.

ఆమె వెను తిరిగింది.

కాకులు నవ్వుకున్నాయి.

*　　　*　　　*　　　*

అది శ్రావణ మాసం. పడమర నున్న కొండలపై పు నుండి తొంగిచూచే మేఘాలకు అంతే లేదు. వానలేదు. జల్లు జల్లుగా పడేవాన. బూడిద రంగు మేఘాలలోంచి జారిపడే పన్నీటి జల్లు. పగలంతా అదే వరుస. రాత్రెప్పుడో కురుస్తుంది కుండలు బోర్లించి నట్టు. ఊరంతా బురద మయం. పొలాల నిండుగ నీరు, నారు పోసిన పొలాలు కొన్ని. ఊరికి దక్షిణ దిక్కున, తూర్పునపరుచుకుని ఉన్నాయి. ఊరికి ఒకటే ఒక టైన "గంగమ్మ చెరువు" ఊరికి దక్షిణాన ఉంది. దానికి దిగువ సారవంత మైన భూములున్నాయి. పడమర నున్న కొండలు ఉత్తరానికి వరుస కట్టాయి. కొండల దాపున భూములకు వర్షమే ఆధారం. భూములేమంత సారవంత మైన భూములు కావు. కొండల కానుకొని రెండు మూడు పల్లె లున్నాయి. చెరువుకు అటు ఇటు చెరొక గ్రామముంది. వాటి పద్మ పురం. మంగాపురం అని అంటారు. పద్మాపురం ఎక్కువ జనాభా గల గ్రామం. ఇవన్నీ పట్టణాలకు ఏడెనిమిది మైళ్ళ దూరంలో ఉన్నవే. ఆ గ్రామాలు, ఆ పల్లెలూ ఒక ప్రపంచం. సమిష్టిగా బతికితేనే బతుకుందక్కడ. చమురు దీపాలే రాత్రికివెలుగు. అన్ని గ్రామాలకు చెరువులు లేవు. నేలబావులే. అవైనా ఒకటి. రెండు. పెంకుటిళ్ళు అక్కడక్కడ. అవైనా పద్మాపురం మంగాపురం లోనే. పద్మాపురంలో శివాలయముంది. దేవుని మహిమచెప్పగల పూజారి, శివరాత్రినాడు దేవుని కీర్తించి జాగరణ చేయించగల భజనపరులు, కాస్తోకూస్తోడబ్బునవారు; చిన్న ఎలిమెంటరీస్కూలు,

రాత్రివేళల అందులో తోగన్ను పెట్టి నిద్రపోయే పశువులు, మునసబుగారి ఇల్లు కరణంగారి అల్లుడిగారి బ్యాటరీ రేడియో, మొరిగే కుక్కలు, అరిచే కాకులు, కష్టపడే కూలి జనం వున్నారు. ఆ కూలీ జనంపై అజమాయిషీ చేస్తూ మకుటం లేని మహారాజుల్లా చలా మంది అయ్యోర్లు కామందులు వున్నారు. ఊరిచివర చెరువుకు కొంత దూరంలో వున్నదే దొన్నమ్మ యిల్లు. ఆ ఊరికేకాక ఆ చుట్టు ప్రక్కలకు కూడ హాస్పిటలేదీ లేదు. అక్కడ హాస్పిటల్ వుండటాన్ని గురించి ఆలోచించేవారే తక్కువ. హాస్పిటలు పెట్టినా డాక్టరు అక్కడ ఎక్కువ కాలం వుండలేడట. కారణం ఊళ్ళో సౌకర్యాలు తక్కువట. కరంటు లేదట, ఊరిలోకి జీపు కూడా రావటానికి సరియైన దారిలేదట. శివాలయం పూజారి చేతిమాత్రలు, స్వామివారి పాదోదకాలను మించిన మందులు లేవట.

అలాంటి ప్రాంతానికి ఆరునెలల క్రిందటే వచ్చాడు డాక్టరు. గవర్నమెంటు తరపునుండి కాదు. కొన్ని ఆశయాల పైరలో పండి వచ్చాడు. కొన్ని ఆశయాల ఫలింపజేసికోవటం కోసం వచ్చాడు. "మందు లిస్తాడట. నయంచేస్తాడట, కాని డబ్బు అడగడట. కుర్రవాడేగాని అనుభవజ్ఞునిలా మందులిస్తాడట. జీతం లేదట. మరెందుకున్నట్టో" ఊరిలో నలుగురు అతను వచ్చిన క్రొత్తలో అనుకున్న మాటలివి.

కడుపులో నొప్పిని చేతితో తీసివేసినట్టు నయంచేసిన తరువాత డాక్టరునడిగాడొక ముసలాడిదే ప్రశ్న.

"నేనిక్కడెందుకున్నానో కావాలా లేక నా మందులు కావాలా?" అడిగాడు డాక్టరు. ముసలాడు నవ్వేశాడు.

"ఇంటి గోడలకు చవుడు పట్టి గోడపాడయితే ఇటుకలూ సున్నము అవసరమా, కాదా? మన శరీరానికి కూడ ఇటుకలు,

సున్నము అవసరమే. మరి ఇవి ఈ మందుల్లో వున్నాయి. నీ గాయమెలా నయమైందనుకున్నావు? మరి మందు వద్దన వచ్చా?" అని అన్నాడట భద్రయ్యగారి ముసలమ్మతో.

"అయితే తినకూడని పదార్థం తిన్నావన్నమాట. ఎంత కొద్దిగా అయినా నీకిచ్చిన మాత్ర ఎంతుందని. జబ్బు నయం చెయ్యటం లేదూ?" కరణంగారి పాలేరుతో అన్నాడట.

సూరయ్య కోడల్ని బ్రతికించినందుకు పాతిక రూపాయలు చేతిలో పెడితే "బీదవాడివి నీవు యిచ్చేదేమిటి? నేను పుచ్చుకొనేదేమిటి?" అన్నాడట.

ఇవే మాటలు డాక్టరు వచ్చిన క్రొత్తలో నీలాటి రేవు దగ్గర శివాలయం అరుగుమీద. నీలాటి రేవుకు నీళ్ళకోసం వచ్చే పొన్నమ్మ జాగ్రత్తగా వినేది మాటలన్నింటిని. అతనెలా వుంటాడో చూడాలనుకునేది. అనుకోవటమే గాని చూడటం కాలేదు. కాని చూడగలిగే రోజు దానే వచ్చింది.

శ్రావణ మాసం, ఉదయపు వేళ, రాత్రి పడ్డ వానతో నేలంతా బురద, బురదగా వుంది. చెరువులో కలువలు, పద్మాలు వర్షపు దెబ్బకు తల ఎత్తుకోలేక పోతున్నాయి. తామరాకు మీద నీటి బిందువులు, నీరెండలో మెరుస్తున్నాయి. మర్రిచెట్టు దిగువ వున్నది ఆడవాళ్ళ నీలాటి రేవు. ఆ రేవుకు దాపులో ఎగువలో వున్నది మగాళ్ళ స్నానాలుచేసే రేవు. నీటిలోంచి బయటకు వచ్చి వాలిన చెట్టు కొమ్మల దాపునకొస్తే మగాళ్ళకు ఆడవాళ్లు కనపడరు. అక్కడ బట్టలు మార్చుకోవచ్చు. నంది విగ్రహం ప్రక్కనున్న బండమీద పిండుకున్న తడి బట్టలనుంచుకో వచ్చు. అక్కడికి ఎగువనున్నది మంచినీళ్ళ రేవు. స్నానం చేసిన వారు నీళ్ళు రేవులో ముంచుకెళ్తారు. ఇంటి దగ్గర స్నానం చేసిన

తరువాత బట్టలు ఉతుక్కోటానికి, మంచినీళ్ళు ముంచుకెళ్ళటానికి వస్తుందక్కడికి పొన్న.

ఆ రోజున అందుకే వచ్చిందక్కడికి. మోకాలు లోతు దాటీ చీరను తడవకుండా పట్టుకుని, బిందెలో నీళ్ళు ముంచుతోంది పొన్న. మగాళ్ళ స్నానాల రేవులో కలకలం. తలఎత్తి చూచింది. అందరూ చూస్తున్నారు. పైకి తేలి చేతులాడిస్తూ మునకలు వేస్తూ మళ్ళా తేలి మునకలు వేస్తున్న వ్యక్తిని. కాలేజీ చదువులు సాగిస్తూ సెలవులకో మరెందుకో వచ్చిన కరణంగారి రెండో అబ్బాయి రేవులో చెట్టుమీంచి పిల్లి మొగ్గ వేసినవాడు, ఊబిలోకి దిగాడట. అందరూ అనుకుంటూంటే విన్నది. రక్షించటానికి ఎవరూ రాలేదు. నీళ్ల లో వున్నవాళ్ళు కూడా ఆదరా బాదరాగా బయటకొచ్చారు. ఈత రానివాళ్ళు మాత్రం అరుస్తున్నారు! కరణంగారి అబ్బాయి మునిగిపోతున్నాడని.

అంతలో పరుగు పరుగున వచ్చారెవరో-పొడవైన అంత బలిష్టము కాని శరీరము-నీటిలోకి దూకి మునిగి ఈదుకుంటు పోయాడు. రెండు క్షణాలు ఎవరూ నీటి మీద కనిపించలేదు. మరి రెండు క్షణాలు గడిచాయి. ఒక చేత్తో కరణంగారి అబ్బాయిని పట్టుకుని, రెండవచేత్తో రేవు ముఖంగా ఈదుకుంటూ, తేలుకుంటూ వచ్చాడతను. అతనే "డాక్టరుబాబు" అట. పొన్న మనసు ఆనందంతో పులకరించింది. అందరి యెడలా దయచూపించే డాక్టరు ఒక ఘనకార్యంచేస్తూ కనిపించటం మరింత ఆనందదాయకమైందామెకు. అందరితో పాటూ తానూ ఆ రేవుకు చేరింది. అతనిని బోర్లా పడుకోబెట్టి రొమ్ము ఎముకల క్రింద నొక్కి నీటిని కక్కిస్తున్నాడు. శ్వాస క్రియను క్రమపరుస్తూంటే అందరూ డాక్టర్ని వింతగా చూస్తూ వుండి పోయారు.

వేణు కళ్ళు తెరిచాడు. డాక్టరుబాబు అందరివైపు తిరిగాడు. "కొద్దిసేపు ఇతనికి విశ్రాంతి కావాలి. ఈ సమీపంలో ఎవరి ఇల్లయినా వుంటే చెప్పండి. అక్కడికి తీసికెడదాం" అన్నాడు.

అందరికన్నా ముందే అంది పొన్న.

"డాక్టరుబాబూ! మా యిల్లు ఇక్కడికి చాలా దగ్గర కండి" అని. ఆమె ఆహ్వానాన్ని అతను కాదనలేదు. ఇద్దరు రైతులు వేణుని చేతులమీద మోసుకొస్తుంటే పొన్నమ్మను అనుసరిస్తూ అందర్నీ చూచి "ఇక ఇతనికేమి భయము లేదు. మీరు మీమీ పనులు చూచుకోవచ్చు. మీలో ఎవరైనా ఇతని తండ్రిగారికి తెలియజేయండి" అంటూ ముందుకి సాగాడు. వేణుకి పడక ఏర్పాటు చేసి వేడి వేడి పాలు గ్లాసులోపోసి యిచ్చింది. వేడి పాలు త్రాగిన తరువాత తేరుకున్నాడతను. పరుగు పరుగున వచ్చారు కరణంగారు. డాక్టరుబాబు చేతులు పట్టుకుని "మీరు దేవుడు" అన్నాడు.

"కాదు. మామూలు డాక్టర్ని. ఈ రోజు సాయంత్రం వచ్చి చూస్తాను విశ్రాంతి తీసుకోమనండి." అంటూ అతనితోనే వేణుని పంపించేశాడు. అతను కూడా వెళ్ళిపోతూంటే వేడి పాలగ్లాసుతో ఎదురొచ్చింది పొన్న.

"త్రాగి వెళ్ళండి" అంది.

"నాకెందుకు?" అన్నాడు.

"మీరు దేవుడు. మీకుకాక మరెవరికి?"

"తప్పు. నేను మామూలు మనిషిని."

"అవును. మనిషి రూపంలో వున్న దేవుడు. తీసికోండి" అంది.

వేడిపాలను ఊదుకుని త్రాగాడతను.

"మీకు భయం వేయలేదూ?"

"ఎందుకు భయం?"

"మునిగిపోయే మనిషి ప్రమాదకరం కాదూ?"

"నాకేమి ప్రమాదమయింది?"

"భలేవారే" అంది గ్లాసునందుకుంటూ.

"వస్తాను" అన్నాడు.

"ఒట్టిది." అంది పొన్న.

"ఏమిటి?" అన్నాడు.

"మీరు మళ్ళా మా యింటికెందుకొస్తారు? అందులోనూ మాలాంటి వారింటికి?"

"భలేవారే! వెళ్తాను" అన్నాడు నవ్వుతూ.

'అయితే మళ్ళీ రారా?"

"ఎందుకు?"

"ఇందాక మీరే వస్తానన్నారుగా!"

"వెళ్ళి వస్తాననటం మనలో మామూలు" అన్నాడు డాక్టరు బాబు.

"అనటం కాదు మీకు వీలయినప్పుడు రండి. మీలాంటి దేవుళ్ణి చూడటం నాకానందం. ఒక గ్లాసు పాలు త్రాగి పోవచ్చు. అందరూ మీరెంతో మంచివారంటే విన్నానే గాని, మీరెంత మంచి వారో ఈ రోజే తెలిసింది."

"ఊరకే పొగిడేస్తున్నారు. సెలవా?" అంటూ నవ్వేశాడు. ఆ విధంగా ప్రథమంగా కలిసింది డాక్టరుబాబును పొన్న

* * *

అది నల్లని రాత్రి.

ఆకాశం మీద మేఘాలు క్రమ్ముకున్నాయి. చెరువు గట్టున జువ్వి చెట్లు గాలికి రొదచేస్తున్నాయి. ఏ క్షణంలోనైనా వర్షం వచ్చేటట్టుంది.

మంచంమీద కుర్రాడు జ్వర తీవ్రతతో పలవరిస్తున్నాడు.

మంచం ప్రక్క తల్లి కళ్ళ నీళ్ళు గ్రుక్కుకుంటోంది అకాల మరణాన్ని పొందిన భర్తను తలచుకుంటోంది, ఆమె బాధ చూడలేకపోతోంది పొన్న. కనిపించని దేవుడికి మొక్కుకుంటోంది. ఆమె అంది! "సీతాలు! ఎంతకని బాధపడతావు? పద డాక్టరుబాబు దగ్గరికి వెడదాం"

"పొన్నా ఈ చీకటిలోనా? ఈ గాలిలోనా?" ఆకాశంపైపు. కన్నీళ్ళతో చూస్తూ అంది సీతాలు.

"రంగడికేమి కాదు. నాలుగు దుప్పట్లు కప్పి నా భుజాన్న వేసుకుంటాను. నీవు నా వెంటరా. డాక్టరు దేవుడు." చెప్పిఒప్పించ ప్రయత్నించింది పొన్న. సీతాలు అంగీకరించలేదు.

"రాలేను పొన్నా! నా చేతులారా రాబోయే గాలీ వానలో నా కొడుకుని చంపుకోలేను." అంటూ కొడుకుని గుండెకు హత్తుకుని దుఃఖించ సాగింది."

"సరే! అలాగేకానియ్యి నేనేవెళ్ళి డాక్టరుబాబుని తీసికొస్తాను డాక్టరుబాబు రాకపోరు అంటూ చీకటికేసి దూసుకు పోయింది పొన్న.

సుడిలోకి దూకి ఒక ప్రాణిని రక్షించిన డాక్టరే ఆమె కళ్ళ ముందున్నాడు. చీకటి ఆమెకు కనపడటం లేదు. గాలి వీస్తున్న సంగతామెకు తెలియదు.

"డాక్టరుబాబు అంతటి సాహసం చేయగా; నేనీమాత్రం సీతాలుకోసం చెయ్యలేనూ?" పదే పదే అనుకుంటోంది. తుఫాను వచ్చినా, పిడుగులు పడ్డా డాక్టరుబాబు వచ్చే తీర్తాడు." అనే నమ్మకంతో ముందుకు సాగింది. మంగాపురం చేరి డాక్టరుబాబు ఇల్లు వాకబు చేసిం . అతని ఇల్లు చేరేసరికి ముందున్న గదిలో హరికేన్ లాంతరు వెలుగుతోంది. రెండో గదిలో డాక్టరున్న సవ్వడి వినవచ్చింది.

పిలిచింది పొన్న. రెండో పిలుపు అవసరం లేకుండా వచ్చాడు.

"ఎవరూ?"—అడిగాడు చీకటిలోకి చూస్తూ.

"నేను డాక్టరుబాబూ!....నేను పొన్నను....పొన్నమ్మను.... పద్మాపురం"

"ఓ! మీరా! రండి. ఏం ఇలా వచ్చారు? నా అవసరం ఏదైనా ఉందా?" యింటిలోకి ఆహ్వానిస్తూ అడిగాడు. పరిస్థితి చెప్పింది.

"చాలా శ్రమపడి వచ్చారు. ఇంత చీకటిలో, ఈ పరిస్థితిలో నేనెలా వస్తాననుకున్నారు?" అడిగాడు.

"మీరెలాంటి పరిస్థితిలోనైనా ఒక ప్రాణికోసం వస్తారు డాక్టరుబాబూ! నాకు తెలుసు బాగా"

"నామీద మీకు చాలా నమ్మకం'

"గుడిలో దేవుడైనా అన్యాయం చేస్తాడు. మీరు మాత్రం నమ్ముకున్నవాళ్ళకు అన్యాయం చెయ్యరు డాక్టరుబాబూ!"

అతను ఆ వెలుగులో ఆమె ముఖంలోకి చూశాడు. అది పొగడ్త కాదు. హృదయం లోంచిపలికిన పలుకు. అమాయకమైన కళ్ళు. ఆ కళ్ళలో నిశ్చలతా భావం అతనిని ఆకట్టుకున్నాయి.

"కూర్చోండి. ఇప్పుడే వస్తాను" అంటూ ఇంటిలోకివెళ్ళాడు. పొన్న నిలబడి పోయింది. మూడు గదుల ఆ ఇంటిలో మందుల వాసన బీరువాలోంచి రాసాగింది. చివరిగదిలో వంట గిన్నెలు, కిరోసిన్ స్టవ్ కనిపించాయి. వంటయిందో, అవుతోందో, అవలేదో ఆమెకు తెలియదు.

కొద్దిసేపటిలో మెడికల్ చష్టుతోనూ, త్రీసెల్సు టార్చిలైటు తోనూ వచ్చాడు. "పదండి" అంటూ ఇద్దరూ ఇవతలికి వచ్చారు. గాలి వీస్తునే వుంది. చీకటి చిక్కగా వుంది. చిన్న చిన్న వాన చినుకులు పడసాగాయి. మంగాపురం దాటారు. అతనితో సమంగా నడవలేక పోతోంది పొన్న.

"నేను మీతో పరుగెత్తలేను డాక్టరుబాబూ!" అందిపొన్న. డాక్టరు వెనుతిరిగి అయాసపడుతూ వస్తున్న పొన్నను చూచినడక వేగం తగ్గించి ఆమెతో కలిసి నడువసాగాడు. ఎదురుగాలిలో కదలి పోతూ పొన్న అతని చేతిలోని మెడిసిన్ చష్టునందుకుని అతని చేతిని గట్టిగ పట్టుకుని నడవసాగింది. చినుకులు పెద్దవయినాయి. వానశృతి మించిది. పొన్నతో డాక్టరు పరుగెత్తి నాలుగంగల్లో పద్మాపురం చేరారు. వాళ్ళుచేరేసరికి సీతాలు వాళ్ళకోసమే ఎదురు చూస్తోంది.

పొన్న మంచం మీదనున్న కుఱ్ఱవానిని చూపించింది. భయపడనవసరం లేదని ఇంజక్షన్ యిచ్చి మందులు మ్రింగించి

సీతాలు తృప్తికోసం కుర్రాడు కళ్ళుతెరిచేంతవరకు డాక్టరుఅక్కడే ఉండిపోయాడు. పొన్న ఇంటికి పరుగెత్తి కంచుగ్లాసులో పాలు పోసి డాక్టరుచేతికిచ్చింది. అతను భోజనం చేయలేదు. ఆకలిగా ఉంది. అందుచేత ఆమె ఆతిధ్యాన్ని కాదనలేకపోయాడు. వర్షం కుండ పోతగా పడసాగింది. కుర్రవానికి జ్వరం తగ్గుముఖం పట్టింది.

" అబ్బాయికేమీ ఫరవాలేదు. మరినేను వెళ్తాను" అన్నాడు అతని దీక్షచూస్తే ఆ వర్షంలోనే వెళ్ళిపోయేటట్టు కనిపించసాగాడు. "ఈ వర్షంలో మీరెక్కడికి వెళ్ళవద్దు ఇక్కడే ఉండిపొండి: మాయింటిలోనే. ఈ వర్షంలో వెళ్ళడంమంచిదికాదు. చెఱువుగట్టు మీద నాగులు, త్రాచులు ఉంటాయి. మీరు వెళ్ళటం క్షేమకరం కాదు" అంది.

" అవి నన్నేమీ చేయవు."

" మీ ప్రాణం విలువ మీకు తెలియదు. మీలాంటిదేవుడు పోతే మేమంతా ఏమైపోవాలి? "

" నాకేమీకాదు. ఈ వర్షంలోనే నాకోసం ఎవరైనావస్తే ఆరోగులను రక్షించేందుకైనా నేనుపోవాలి. నేనువెళ్తాను. రేపు ఉదయం వచ్చి చూస్తాను. " అంటూ ఆమె అనుమతి కోసం వేచివుండక వర్షంలో ముందుకు కదిలాడు డాక్టరుబాబు. ఆతని పట్టుదల అర్ధమైన పొన్నఅతనిని ఆపలేక పోయింది.

అది రెండవ పర్యాయం ఆమె అతనిని కలియుటం.

ఈ సంఘటన జరిగిన మరి రెండురోజులకు విచిత్రమైన ఆలోచన వచ్చింది పొన్నకు. సీతాలు కొడుక్కి జ్వరంవచ్చిన

వర్షం రోజురాత్రి డాక్టరుబాబు; తనురమ్మనగానే వచ్చాడు. కాని ఆ వేళలో అతను భోజనం చేసినదీ లేనిదీ గమనించలేకపోయింది. కాని అతను రాత్రంతా వస్తున్నట్టుగానే ఆమెకు నమ్మకం. తనుఎంతసేపు తన స్వార్థమే ఆలోచించిందికాని అతనికి కలిగిన అసౌకర్యమును గమనించలేదు. తనావిధంగా అతని గురించి ఆలోచించలేకపోయినందుకు కించ పడింది. అతనిని క్షమార్పణ కోరుకుంటే గాని మనసు ఊరట చిక్కినట్టు కనిపించలేదు.

కనుచీకటి పడేవేళ బిందె పట్టుకుని చెరువువైపు నడిచింది రెండు మాసిన చీరలను బిందెలో వేసుకుని డాక్టరుబాబు ఏ ఊరి నుండి మంగాపురం వెళ్ళినా అక్కడనుండి కనిపిస్తుంది. బాట కనిపించేటట్టు రేవులో కూర్చొని చింతపండుతో బిందె తోముతూ కూర్చుంది. బిందెతోమటం పూర్తయిందిగాని అతను కనిపించ లేదు. రెండు చీరలు ఝాడించడం అయిందిగాని అతను రాలేదు.

చీకటి పడింది. అది చంద్రుడు రాని రాత్రి. చుక్కలవెలుగే శరణ్యం. ‘ ఇంతవరకు ఏ ఊరిలోనూ డాక్టరు బాబు ఉండిపోరు. ఎప్పుడో ఇల్లుచేరుకుంటారు’ అని నిశ్చయించుకుని తిరిగి వచ్చింది హొన్న. భోజనం అన్యమనస్కంగా చేసింది. మనసుకు నిలకడ కుదర లేదు.

జడను విప్పిమరల వేసుకుని, చీరమార్చుకుని, ఇంటికి తాళంవేసి చెరువుగట్టువైపు నడక సాగించింది. డాక్టరుబాబును కలిసి క్షమార్పణ చెప్పాకోవాలన్నదీ ఆమె కోరిక తప్ప, పది గంటల చీకటి రాత్రిలో ఒక ఊరినుండీ మరొక ఊరికి తరలి పోయి డాక్టరు కంటపడి క్షమార్పణ చెప్పాకోవాలన్న కాంక్ష తనలో చాల బలీయంగా వున్నప్పటికీ, అతని దృష్టిలో అది అల్ప మైన విషయంగా కనిపించి, తనను కలియటానికి అది ఒక మిష

అని మాత్రం అతడనుకుంటాడేమో అన్న ఆలోచనే ఆమెకురాలేదు. సీతాలు కొడుకు కోసం డాక్టరు దగ్గరకు పరుగెత్తిన రాత్రి వంటి రాత్రి కాదది. ఆ ఆలోచనే ఆమెకు రాలేదు. కార్యమేవిధంగా అవుతుందన్న ఆలోచన తప్ప దాని పర్యవసానంమీద ఆమె దృష్టిలేదు.

అదేమి చిత్రమో ఆమె వెళ్ళే సరికి అతని ఇంటికి తాళం వుంది. దిగాలు పడింది పొన్న. చీకటిలో తడక వాయిన ఇంటి వరండాలోనే నిలుచుంది. ఎవరో యింటి ముందు డాక్టరుబాబు కోసం కాపోలు అటు ఇటు తిరిగి వెళ్ళిపోయారు, డాక్టరుబాబు త్వరలోనే రావచ్చు అన్న ఆశ కలిగిందామెకు. కొన్ని క్షణాలు భారంగా గడిచాయి. అనుకున్నట్టుగానే అతడు వచ్చాడు. అతను తలుపు తీసికుని లోపలికి వెళ్ళిన తరువాత గాని ఆమెకు తోచలేదు తానెలాంటి వేళలో వచ్చినదీ. ఏ తప్పుకు క్షమార్పణ కోరుకోవాలని వచ్చిందో అదే తప్పును తిరిగి తాను చేయబోతున్నదని తెలిసి వుంది. అతను దీపం వెలిగించాడు. ఆ వెలుగులో అలసిపోయిన అతని ముఖం కనిపించింది. ముందుకు వెళ్ళాలా వెనుకకు తిరిగి వెళ్ళిపోవాలా ఆమెకు తోచలేదు. ఇంటి గదిలోకి వెళ్ళిన అతను తిరిగి రాలేదు యివతలికి, చొరవ చేసుకుని ముందు గది, రెండవ గది దాటి వెనుక గదిలోనికి వెళ్ళింది. నలుడు, భీముడు వంటింటిని ఏవిధంగా పావనం చేసి వుంటారో ఆమె చూడలేదు గాని డాక్టరును చూస్తే నవ్వొచ్చిందామెకు. నవ్వాపుకుంటూ "లోపలికి రావచ్చా డాక్టరుబాబూ?" అంది.

త్రుళ్ళిపడి తల ఎత్తాడతను. ఆమెను చూచి "ఓ మీరా? ఏం వచ్చారు?" అని అడిగాడు. "అవును నేనే!....పొన్నను" అంది తడబడుతు.

"ఏం? మరేదయినా కేసా?"

"అవును. కాని ఏమంత కంగారు కాదు. మీరు భోజనం చేసిన తరువాతనే బయలుదేరి వెళ్ళవచ్చు" అంది పొన్న.

"అలా కాదు. పదండి వెళ్దాం" అంటూ రెండో గదిలోకి వచ్చాడు. ఆ గదిలో దీపం లేదు. చీకటిలోనైనా ప్రక్క గదిలోని దీపం వెలుగు వల్ల ఆమె ముఖం, తెల్లచీర, ఆకాశం రంగు జాకట్టు, వీపు మీది నల్లనిజడ, జడలో కనకాంబరాలు కనిపిస్తున్నాయి.

"చెప్పానుగా డాక్టరుబాబూ! అంత కంగారు లేదని. ముందు మీరు భోజనం కానియ్యండి వెళ్దాం....అయినా ఆ నిప్పు మీద గిన్నెనలా వదిలేస్తే వంట ఏమవుతుంది?" అడిగింది.

"అవును నిజమే. అయితే ముందు మీరు వెళ్ళండి. అర గంటలో నేనే మీ యింటికి వచ్చి పిలుస్తాను."

"ఈ చీకటిలో ఒంటరిగా వెళ్ళలేను డాక్టరుబాబూ. కలిసే వెళ్దాం. మీరు కూర్చోండి. వంట నేపూర్తిచేస్తా." అంటూ వెనుక గదిలోనికి వెళ్ళి బొడ్లో చీరకుచ్చిళ్ళు దోపుకుని, చీర పైట కొంగు బొడ్లో దోపుకుని కత్తిపీట ముందు కూర్చుని అతను ప్రారంభించిన పనిని పూర్తి చెయ్యటానికి ఉద్యుక్తురాలయింది. ఆమెను వారించటమెలాగో తెలియలేదుడాక్టరుకు. అదేసమయంలో అవతలి నుండి "డాక్టరుబాబూ," అంటూ పిలుపు. అతను వీధిలోకి వెళ్ళక తప్పలేదు.

పొన్న వెలుగులో వుంది. ఆమెకు వీధిలో నున్నదెవరో కనిపించటం లేదు. కాని చీకటిలో నున్నవారికి ఆమె కనిపించి ఉండాలి. పూర్తిగా కాక పోయినా గాలిలో రెపరెపలాడే చీర కుచ్చిళ్ళు నల్లని జడ కనిపించి వుండాలి. చీకటిలో వున్నవారికి వెలుగులో నున్నవారు కనిపిస్తారు. కాని వెలుగులో నున్నవారికి చీకటిలో నున్నవారు కనిపించరు మరి.

పదిపదిహేను నిమిషాలకు అతడు వచ్చాడు. ఆ సరికి పొన్న వంట చేయటంలో నిమగ్నమైన తీరును చూచి మాటాడలేక గుమ్మందగ్గరే నిలబడిపోయాడు. చిట్టచివరకు నోరు పెగుల్చుకుని "మీకెందుకింత శ్రమ" అని అడిగాడు. "భోజనం చెయ్యండి చెప్తాను" అంది.

గది తుడిచి, కంచంవేసి, అన్నం కూర వడ్డించి, మంచి నీళ్ళ గ్లాసును ప్రక్కనుంచి "రండి" అంది.

"మీరు వచ్చిన పని ఒకటి చేసిన పని మరి ఒకటి. మీరూ భోజనం చేస్తే బాగుంటుంది" అన్నాడు.

"కాని, ఇది ఇద్దరు మనుషులకు సరిపోదు. నేను యింటి దగ్గర భోజనం చేసి వచ్చాను. మీరు భోజనంచెయ్యండి." అంటూ అతన్ని భోజనానికి పిలిచింది.

"మీరు మా గురించి ఆ రాత్రి భోజనంమానేశారు. అందుకు నాదే బాధ్యత. అందుకు-తప్పుకు క్షమార్పణ చెప్పుకుందామనే వచ్చాను" అంది అతను భోజనం చేస్తుంటే. అతను తలఎత్తి చూశాడు! ఆమె కళ్ళలో ఏదో మెరుపు అతను తల దించుకుని మౌనంగా భోజనం చేయసాగాడు.

"మజ్జిగ ఎక్కడుంది?"

"ఆ గిన్నెలో ఉంటుంది" చూపించాడు. పొన్న గిన్నె నందుకుంది.

"ఇదా! ఇది మజ్జిగా?....ఇది మజ్జిగేనా?"

"అవును. ఇది మజ్జిగే. మంగాపురం పెరుగు ఈ రూపానికి వచ్చింది."

అతను చెయ్యి కడుక్కుంటూంటే అడిగింది. "పోనీ! మా యింటి నుండి పాలు పెరుగు పంపనా?"

"ఇక్కడ దొరుకుతున్నాయిగా!"

"చూస్తున్నాగా. ఉంచండి....ఆ గిన్నెలు కంచం...."

"అరే! మీ కెందుకు ఆ పని. ఆ ప్రక్కనుంచితే పనివాడుదయం కడిగేస్తాడు" కంచం, గిన్నెలు ముట్టుకోబోతున్న హాసన్నను వారించాడు.

"పోనీ! ఆ ప్రక్కన ఉంచుతాలెండి"

"అది కూడ ఎందుకు? తప్పు....వద్దు వినండి" అంటూ ఎంగిలి కంచాన్ని పట్టుకోబోతున్న ఆమె చేతిని పట్టుకున్నాడు వారిస్తూ, హాసన్న తనచేతిని విడిపించుకొని, చేయికడుగుకుని, పైట చెరగుతో చెయ్యి తుడుచుకుంటూ రెండవగదిలోకి వచ్చింది. దీపం టేబిల్ మీద ఉంది. గోడమీద ఇద్దరి నీడలు పడ్డాయి.

"నన్ను క్షమించరా?" అడిగింది.

"దేనికి?" అని అడిగాడు.

"ఆ రోజు రాత్రి భోజనం చెడగొట్టినందుకు" అంది.

"మీరింకా అదే ఆలోచిస్తున్నారా? డాక్టరు వృత్తిని చేపట్టిన తరువాత సుఖం కోరుకోకూడదు. కష్టాలెలా వుంటాయో తెలిసికోవటం కోసమే నేనీ ప్రాంతానికి వచ్చాను. పట్టణ ప్రాంతాలకు పోతే నేను మనుషులనే చూడగలను. సుఖాలను మరిగి, మనుషుల కష్టాలు గ్రహించలేక నలుగురి దృష్టిలో డబ్బును గుంజే జలగనే అవుతాను. జీవితం అంటే ఏమిటో నాకు తెలియాలి. కష్టాలంటే ఏమిటో తెలియని చోట పుట్టిపెరిగాను నేను. పెరుగు

లేనప్పుడు మజ్జిగ గురించి ఆలోచిస్తాం. అదీ లేనప్పుడు పేదవారేం చేస్తారో చాలా మందికి తెలియదు. నాకది తెలియాలి. అదేకదా జీవితం. మనిషి మనిషిగా బతకగల చదువునే నేర్చుకో గలగాలి. అందుకనే నేనిక్కడికి వచ్చాను. నా పని పూర్తయి పోగానే వెళ్ళి పోతాను. ఎలాగో ప్రభుత్వం నా కోసం ఖర్చుపెట్టి చదువు కోటానికి అవకాశాన్నిచ్చినందుకు. ఈ గ్రామ ప్రాంతాలలో కొంత సేవచేసి మరికొంత నేర్చుకుని వెళ్ళిపోతాను" అన్నాడు.

పొన్నకు మాటలు రాలేదు.

ఎందుకో కళ్ళలో నీళ్ళుతిరిగాయి. "అదేమిటి, అలా ఉండి పోయారు" అడిగాడు.

"నాకు మాటలు రావటం లేదు డాక్టరుబాబూ! మీరు చాలా పెద్దవారు. ఎన్నో విషయాలు తెలిసిన వారు. మీరు నేర్చుకోవల సిందేముందిక్కడ?"

"ఎందుకులేదు.?" మీ నుండి నేర్చుకోవలసిం దెంతలేదు! నీటిలో మునిగిన వానికి ఆశ్రయ మివ్వటానికి అందరికన్నా ముందు మీరెందుకు వచ్చారో! ఆకాశం విరిగి మీదపడుతుందని తెలిసి, చీకటిలో, గాలివానలో ఒక ప్రాణికోసం ఎందుకు పరుగెత్తు కొచ్చారో! నా చేతిలో గరిట నందుకుని వంటకు మీరెందుకుపక్ర మించారో, మా యింటిలో సోఫాలమీద కూర్చుంటే నాకెలా తెలు స్తుంది చెప్పండి?" అడిగాడు. మాటాడలేక పోయింది పొన్న కొద్దిసేపు.

"నేను మీకేమీ సమాధానం చెప్పలేను. కాని మీలా ఆలో చించే వారు ఎంతమందో ఉండరని చెప్పగలను. మిమ్మల్ని అర్థంచేసికున్న వారెంతమందో ఉంటారని నేననుకోను. కొంత వరకు నాకర్థమయ్యారని పిస్తోంది....డాక్టరుబాబూ.... ఇక నుండి నన్ను "పొన్న" అని పిలవండి. "మీరు" అని మన్నించకండి.

"అలా పిలవాలనిపించినపుడు అలాగే పిలుస్తాను" అన్నాడు.

"కొద్దిసేపటిలో మనం బయలు దేరుదాం!" అన్నాడు.

"మరి మీరెక్కడికి వెళ్ళనవసరంలేదు డాక్టరుబాబూ" అంది పొన్న.

"ఎందుకని?"

"మీరు పరీక్షించ వలసిన రోగిని నేనే. నన్ను క్షమించ మని వేడుకుందామనే వచ్చాను. మీరు క్షమిస్తే నా మనసు తేలిక అవుతుంది"

"నిజమేనా? కేసులేదా?"

"ఊహు మీరు నన్ను క్షమిస్తారా?"

"ఇంత చిన్న విషయానికా ఇంత బాధపడుతున్నారు? పదండి. కొంతవరకు, మిమ్మల్ని దిగవిడిచి వస్తాను" అంటూ ఆమెతో ఇవతలికి వచ్చాడు డాక్టరు.

చీకటిలో రెండు ఆకారాలు చెరువు వైపు కదిలాయి.

* * *

సీతాలు కొడుకు ఆరోగ్యవంతుడయి చాలారోజులయింది. వాడు యధాప్రకారం బడికి పోతున్నాడు.

ఆ రోజు సాయంత్రం నీలాటి రేవునుండి బిందె నెత్తుకుని సీతాలుతో వస్తున్న పొన్నకు సీతాలు కొడుకు కోసం డాక్టరు దగ్గరికి పరుగెత్తుకుని వెళ్ళిన వర్షపు రాత్రి గుర్తుకొచ్చింది. వెంటనే అడి గింది పొన్న.

"సీతాలూ! రంగడి జబ్బునయమైంది కదా! డాక్టరుబాబు ఋణం తీర్చుకోవాలనిపించలేదా?"

"లేకేం? పొన్నా! గుండెనిండా ఉంది. కాని ఆ బాబు డబ్బు తీసికోడట. మరెలాగ?" సంశయాన్ని వెలిబుచ్చింది సీతాలు.

"అయితే చేతులు కట్టుకు కూర్చుంటావా సీతా! మంచి నెయ్యి కాచి ఇవ్వు. లేకపోతే మీ కోయ చుట్టానికి చెప్పి పుట్టతేనె తెప్పించే ఇవ్వు. లేకపోతే సారపప్పు తెప్పించి ఇవ్వు. అదీ కాకపోతే వాడుకలు తగ్గించి పాలు, పెరుగు బాబుకి పంపు. నీకు తోచి నంతకాలం."

"నిజమే పొన్నా! నా మనసుకు తోచలేదు"

"నిజంగా నే చెప్పినట్టు చెయ్యి సీతా! అదే నా కొడుకయితే నేనిలా ఊరుకునే దానిని కాదు"

పొన్న ముఖంలోకి చూచింది సీతాలు. సీతాలు చూపులోని భావాన్ని గ్రహించి తల దించుకుంది పొన్న.

"నీ పెళ్ళి, నా పెళ్ళి ఒక వారం రోజుల తేడాలోనే అయినాయి." పొన్న మాటాడలేదు.

"మీ ఆయన నీతో సరిగా ఉంటే రంగడిలాంటి కొడుకు నీకూ వుండేవాడు కదూ!"

"..............."

"నా మాటలు నీకు బాధ కలిగిస్తున్నాయి కదూ? మీ అమ్మ చనిపోతూ నీ బాధను నీకే వదిలింది. నీవు యింత మంచిదానవు ఇంత అందమైన దానివి. మరి నిన్నతడు ఎందుకు కాదన్నాడు పొన్నా?" అడిగింది సీతాలు.

"ఇప్పుడదంతా ఎందుకులే సీతా? అతడెవరినో ఏలుకుంటు న్నాడుగా" అంది తల దించుకుని పొన్న.

"అతను సుఖ పడుతూంటే నీవెందుకిలా ఉండిపోవాలి?"

"అంటే?"

"పెళ్ళి చేసికోకూడదూ?"

"వద్దులే సీతా! అమ్మ యిచ్చిన కట్నమే తక్కువైందని తాళి కట్టిన భార్యనే పెళ్ళి బట్టలతో బయటికి తరిమి కొట్టిన నాభర్త లాంటి వాళ్ళే చాలా మంది మగాళ్ళు. ఇక ఎవరిని నమ్మను? మరి నీ పెళ్ళి కుదిరిందటగా. మీ మరిదేనా?

సీత సిగ్గుతో తల దించుకుని అవునన్నట్టు తలూపింది.

"అయితే నీ పెళ్ళెప్పుడు?"

"పంట ఇంటికి వచ్చిన తరువాత" ఇల్లు దగ్గర కొచ్చింది. పొన్న ఇంటి దగ్గర ఆగిపోయింది. సీత ముందుకు సాగింది.

బిందెను క్రిందపెట్టి చీరకొంగుతో ముఖంమీది చెమటను తుడుచుకుంది పొన్న. సీతాలు ప్రసంగంతో మనసు వికలమైంది. పొయ్యిలోకి కర్రలనెగదోసి మండుతున్న మంటవే చూస్తూ పొయ్యి ముందున్న పీటమీద కూర్చుండిపోయింది. పొయ్యిమీద కుండలో ఉడుకుతున్న బియ్యంలా మనసు మదనపడసాగింది. ఎగేసే మంటలకు కుండ నుండి పొర్లుతున్న గంజిని ఆమె గమనించలేదు. ఎర్రని మంటలు ఆమె కళ్ళలోపడి కళ్ళ ఎర్రదనాన్ని మరింత ఎక్కువ చేశాయి.

తన పెళ్ళి గుర్తుకొచ్చిందామెకు. పాడి పంటలుగల ఇంకిటి కూతుర్ని కోడలుగా పంపగలుగుతున్నందుకు తల్లి పొందిన ఆనందం గుర్తుకొచ్చింది. పెళ్ళి పందిరి గుర్తుకొచ్చింది,—కట్నం

తక్కువైందని మామగారు కినియటం గుర్తుకొచ్చింది—ఆ కాళ రాత్రి కళ్ళను తిరిగింది.—శోభనం రాత్రి ఎంతలో కాళ రాత్రిగా మారినదీ గుర్తుకొచ్చింది.—భర్త చేతగానితనం—మామగారి తిట్లు—తల్లి ఏడుపు—గడియలు పడిన వీధి తలుపులు—వీధిలో నల్లని చీకటి—ఆ చీకటిలో తల్లి వోదార్పు—ఏడ్వలేని తన బరువైన గుండె—అంత కన్నా బరువైన మంగళసూత్రం—అన్ని గుర్తుకొచ్చాయి. ఆ రాత్రి చీకటిలో ఇంటికి ఎలా చేరినదీ, ఆ రాత్రి ఎంత భారంగా గడిపినదీ గుర్తుకురాలేదు పొన్నకు.

తల్లి జరిపిన దాను భారమెలా విఫలమైనదీ, తనను సుఖపెట్టాలని తన తల్లి పడిన యాతనలు, పొన్న మరచిపోలేదు. మనో వ్యాధితో మంచం మీదనున్న తల్లిని విడిచి ఎక్కడకీ పోలేని తన పరిస్థితి, నలుగురి మధ్యన నిలబడి "ఈమె నా భార్య" అని చెప్పగల ధైర్యం లేక మగాడుగా తననుండి స్త్రీసుఖాన్ని రహస్యంగా పొందాలని భర్త తన్ను కాంక్షించిన రాత్రి ఆమె పడిన బాధను, ఆమె మరచిపోలేక పోయింది. తల్లి మరణం ఆమెకు గుర్తు.—ఆమె శవంపై పడి తను రోదించటం తనకు గుర్తు.—భర్త తనపై ప్రతీకారంతో వేసిన నిందలు గుర్తు.—మరచిపోవలసినవన్నీ తనకు గుర్తే.

గతం నుండి మనసును మళ్ళించుకోవాలని పొయ్యి ముందు నుండి లేచిపోయింది పొన్న. పెరుగు వాడికల కోసం ఎవరో వచ్చారు. గిన్నెలోకి పెరుగును పోస్తూంటే డాక్టరుబాబు గుర్తుకొచ్చాడు.—అతని మాటలు గుర్తుకొచ్చాయి. చీకటి గుర్తుకొచ్చింది.—వీధిలోకి చూసింది.—చీకటిలో అతనే కదలి వచ్చినట్టయింది. మనసులో కలత తొలగిపోయింది.

"ప్రతిరోజు పాలు పెరుగు డాక్టరుబాబుకు పంపుతేనో!" అనుకుంది. కాని ఎవరితో పంపాలో తెలియదామెకు. "తేనే తీసి

కెడితే?"—తన ఆలోచనకు తనకే నవ్వు వచ్చింది. తల్లి పోయిన రోజులలో ఊరిలోనున్న నలుగురి పెద్దల ఇండ్లకు పాలు వాడికగా పట్టుకెళ్ళినప్పుడు జరిగిన అనుభవాలు గుర్తుకొచ్చాయి. కళ్ళవెంట నీళ్ళు తిరిగినట్టయింది. ఏడవాలనుకుంది. కాని నోరు మెదపలేక పోయింది.

మబ్బులు కొండల్ని కౌగిలించుకుని ఏడుస్తాయి. గాలి చెట్లను కౌగిలించుకుని ఏడుస్తుంది. వాగు రాళ్ళ ఒడిలో జారబడి విలపిస్తుంది. కాని మనిషి మనిషిని పట్టుకుని ఏడ్వలేడు. బరువైన గుండెకు లాలించే ఒడి కావాలి. అది పొన్నకు లేదు. ఆ సంగతామెకు తెలుసు. కన్నీళ్ళు రాని కళ్ళను చీర చెంగుతో తుడుచుకుని పశువులశాలలోకి పోయింది పనిమీద పొన్న.

* * * *

ఆ ఊరికి వచ్చి సంవత్సరం దాటక మునుపే ఆ ప్రాంతమంతా పరిచయమైంది డాక్టరుబాబుకి. మంగాపురం చుట్టావున్న పల్లెలు జనవాసాలు అన్నీ బాగా పరిచయమైనాయతనికి. పగలయినా రాత్రయినా, ఎండయినా, వానయినా ఆ ప్రాంతాలకు స్వేఛ్ఛగా పోగలడతను. రోగిని చూచి మందిచ్చి రావటానికి ఎన్ని మైళ్ళ దూరాన్నయినా లెక్క చేయని అతని దీక్ష, అతని ధ్యేయం, ఎవ్వరికీ అర్థం కాలేదు.

ఉచితంగా వైద్యం చేయుటంలో అతని మనసులోని మెత్తదనం ఎవరికీ అర్థం కాలేదు.

లోకంలో మంచి పని చేసేవారుండరని, ఒకవేళ ఎవరైనా ఏ మంచి పనో చేసినా, దాని వెనుక స్వార్థం ఉండి తీరుతుంని. లోకం ఒక న్యాయాన్ని వ్రాసి పెట్టుకుంది.

మనిషి ఎల్లప్పుడూ మంచిగా ప్రవర్తించ కూడదు. కొంత చెడు అయినా చెయ్యాలి. అనాడు లోకం అతన్ని తమలో కలుపు కుంటుంది. లేనినాడు అతన్ని వెలివేస్తుంది. అతను చెడు చెయ్య నంతకాలం అతనిలో చెడును వెతకటానికే పూనుకుంటారు. చెడు కనిపించనపుడు అతను చేస్తున్న మంచిలోనే చెడును వెతుకు తారు. ఆ ప్రయత్నంలో కృతకృత్యులు కాకపోరు.

"ఇలా చేసి ప్రజలను ఆకట్టుకోవాలన్న ప్రయత్నం కాబోలు" శంకించారు కొందరు శివాలయం మండపంలో.

"ఎమ్మెల్లే ఎలక్షన్‌కి పోటీ చేసి గెలవటానికి పునాదులు వేసుకుంటున్నాడేమో!" ఊహించారు కొందరు పెద్దలు.

"కొంపదీసి క్రిష్టియన్ మతాన్నిగాని బోధిస్తున్నాడేమో ఇంతమంది మందుకోసం అతడి దగ్గరకెళ్తారు గాని ఒక్కడూ నిజం చెప్పడు. చూచిచూచి వీడెప్పుడో అందరి మతాలు మార్చే స్తాడు. అసలువాడు కిరస్తానీ వాడే. వాడింట దేవుడి ఫోటో ఒక్కటి కూడా లేదట. ఎలాగైనా వీడిని కనిపెట్టి చూడాలి." ఉద్బోధిం చాడు పూజారి రామప్ప.

"కనిపెడుతున్నా కనిపెడుతున్నా, ఏ ఒక్కనాడైనా ఈ గుడికి వచ్చి దేవుణ్ణి దర్శించిన పాపానికి పోయాట్టయ్యా!" గుర్తు చేశాడు అతని నేస్తం గురవయ్య.

విమర్శకు గురయిన వ్యక్తి ఎదుటలేనప్పుడు విమర్శకు లలో కొందరు అతని పక్షం వహించి, అతనెలాంటి సమాధానాలు చెప్పగలడో ఊహించి వాదాన్ని పెంచి, తర్కం ద్వారా కొన్ని నిర్ణయాల చేసి. వాటిని స్థిరం చేసి విమర్శకు గురియైన వ్యక్తికి ఆపాదించి, వాటిని వ్యాప్తిచేసి తృప్తి పడతారు. అది ఒక కళ. అందులో పోటీయ్యేది అందె వేసిన చెయ్యి.

"తీరికుండదు లేవయ్యా!" సద్దాడు పోలయ్య. చుట్ట చివర్ని కొరికి తుంపును ప్రక్కకు ఊసేస్తూ.

"అవునయ్యా! తీరికెలా ఉంటుంది? ఊరూరు తిరగాలి ఇంటింటికి వెళ్ళాలి. ఎన్నో పనులు చక్కపెట్టాలి. ఎందరినో పలుకరించాలి." అన్నాడు రామ్మూర్తి.

"ఏవో కాని పనులు చేసినట్టు మాటాడతావేమయ్యా! కనలేక బాధ పడతావుంటే సూరమ్మకి మంత్రసానిపని చేశాడు. అదీ తప్పే!" వాదనకు శక్తి కట్టించే విషయాన్నందిచేడు పోలయ్య.

"తప్పేముంది లేవయ్యా! నీళ్ళు తేబోతూ జారిపడ్డ భద్రయ్య గారి కోడల్ని డాక్టరు కాబట్టి చెయ్యి, కాలు పట్టుకున్నాడు. అదే అదనున ఒళ్ళు తడిమినా, మరేమిచేసినా తప్పేముందయ్యా. అతను డాక్టరు." అన్నాడు రామ్మూర్తి.

"ఇదేనయ్యా! మీతో వచ్చిన చిక్కు. ఇంతంటే అంతంటాడు."

"పోన్లే వయ్యా! రాముప్పగారి మాత్తర్ల మీద ప్రజలకు విశ్వాసం పోయిన తరవాత ఎవరుమాత్రం ఏం చెయ్యగలరు?"

అంతటితో ఆ సంభాషణ ముగిసింది.

కాని అక్కడ ప్రతీ సాయంత్రం సమావేశమయ్యే ఆలోకం రోజురోజుకు కొత్త విషయాల్ని కనిపెట్టి నలుగురికి పంచిపెట్టాలని తాపత్రయపడుతూనే వుంది.

* * *

పొన్న డాక్టరుబాబును భోజనానికి పిలిచి వారం రోజు లయింది. అంటే ఎంగడి ఆరోగ్యం కోలుకుని నాలుగు నెలయింది. ప్రతిరోజూ తన యింట భోజనంచేసి వెళ్ళమని పొన్న చేసిన అభ్యర్థనను డాక్టరుబాబు మన్నించినట్టు లేదు. కాని అతడు తన మాటను పూర్తిగా కొట్టివేయుడన్న నమ్మకం పొన్నకుంది.

అందుకు సుమారు ఇరవై రోజుల క్రితం జరిగిన సంఘటనే నిదర్శన మామెకు.

ఇరవై రోజుల క్రితం— డిసెంబరు నెల మొదటి వారంలో పొన్న చెట్టు పొన్న యింటి ముందు ఒత్తుగ పువ్వులు రాల్చే దినాలలో—నాయుడుగారి ఇంటి పెరటిలో నాలుగు రకాల చేమంతులు విరగబూసినరోజుల్లో, మిరప పళ్ళు రైతుల కళ్ళాలలో రంగవల్లికలు తీర్చిదిద్దుతున్న దినాలలో, ముద్దబంతి పువ్వులు పొన్న పెరటిలో మంచు తెరల వెనుక ముసిముసిగా నవ్వుకుంటున్న ఆ దినాలలో, మంచు దట్టంగా కురిసి కరిగిన ఆ నాటి మధ్యాహ్నం ఎండ పెళ్ళున కాస్తోంది. ఒంటిని చురక పెట్టే ఎండ కాదది. ఒంటిని చెమటతో తడిపే ఎండ కాదది. ముసలి వాళ్ళను నీడన ఉండనీయదు, వేడిమితో తల దాచుకోనీయదాఎండ. ఒళ్ళు చిరచిర లాడటంతో సరికాదు. ఎక్కువసేపు ఎండలో ఉంటే కళ్ళు బైర్లు కమ్ముతవి. తల తిరుగుతుంది. అది పైత్యపు ఎండ.

ఆనాటి మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటిన తరువాత పొన్న మధ్య గదిలో వెన్న కరగబెడుతున్న వేళ. సైకిలు దిగి నరాసరి యింటిలోకి వచ్చేశాడు డాక్టరుబాబు. అతడలా వస్తాడని అంతఅకస్మాత్తుగావస్తాడని పొన్న ఏనాడూ ఊహించ లేదు.అతని రాకతో తికమక పడింది.

"ఒళ్ళు తిరుగుతున్నట్టుంది. కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని వెళ్ళిపోతాను పొన్నా" అని ప్రాధేయ పడుతూనే గది నలు మూలలా పరికించి చూడసాగాడు ఎక్కడ విశ్రమించటమా అని. కుంపటి ముందునుంచి గబగబా లేచింది. పెరటిలో పశువులశాలకు ముందున్న కరివేపాకు చెట్టు నీడన అంత వరకు తను పడుకున్న మంచాన్ని, ఎండలోంచి నీడలోకి లాగి, బొంత పరచి తలగడవేసి "రండి డాక్టరుబాబూ!" అంటూ పిలిచింది పొన్న. ఆ పిలుపు కోసమే వేచివున్న అతను తలను రెండు చేతులతో పట్టుకుని మంచం మీదకు ఒరిగాడు. ఉలుకు పలుకు లేకుండా పడుకున్న అతని కోసం తానేమి చేయగలదో తోచలేదు. ఎండలో వున్న సైకిలును నెమ్మదిగా వీధి వసారాలోని తడిక ప్రక్కన నిల బెట్టింది.

"డాక్టరుబాబూ! మందేదైనా వేసుకుంటారా? మంచి నీళ్ళి వ్వనా, వేడి పాలివ్వనా?" అడిగింది.

"వద్దు....ఒంటిలో పైత్యం....ఎండ....విశ్రాంతి....చాలు.... అన్నాడు ప్రయాస మీద. ఇంటిలోకి వెళ్ళి నీళ్ళలో ఉప్పి, నిమ్మకాయ రసం కలిపి తెచ్చి అతని చేత త్రాగించింది. అర గంట తరువాత లేచి కూర్చున్నాడతను. అతను లేవటం చూసి పెరటిలోకి వచ్చింది పొన్న.

"నీకు చాల శ్రమనిచ్చాను పొన్నా! రాత్రంతా విశ్రాంతి లేదు, ఉదయం నుండి విరామం లేక తిరగవలసి వచ్చింది. అందుచేత ఒళ్ళు అదోలా అయింది. మరి వెళ్ళొస్తాను" అంటూ లేచాడతను.

"అంత విశ్రాంతి లేకుండా ఈ ఎండలో తిరగటం ఎందుకు? మీరు వెళ్ళినా విశ్రాంతి తీసుకోరు. నాకు తెలుసు సాయంత్రం వరకు విశ్రాంతి తీసుకుని వెళ్ళండి.

"వద్దులే పొన్నా!" అంటూ బయలుదేర బోయాడు.

"వెళ్ళకండి నా మాట వినండి. మీకేమైనా అయితే మేమంతా ఏమై పోవాలి?"

"నాకేదో అవుతుందని నీ వెందుకు భయపడతావు? నాకేమీ కాదు. అయినా నీకేనాడూ నేను మందివ్వలేదు కదా, నీకెందు కంత ఆవేదన?"

"నాకు సంబంధించినదే లోకమా బాబూ! నాకు మందివ్వ నంత మాత్రాన మీరు డాక్టరు కారా? డాక్టరుబాబూ! నేనొకటి అడగనా? ఇంత ఊరుండగా ఈ వేళ ఇక్కడికే రావాలని ఎందు కనిపించింది?" అడిగింది పొన్న.

"నాకెందుకో ఇక్కడికే రావాలని పించింది. ఇక్కడే నాకు విశ్రాంతి దొరుకుతుందనిపించింది పొన్నా! వచ్చానందుకే" అన్నాడు. పొన్నకు చెప్పలేనంత గర్వంకలిగింది మనసులో. సాయంత్రం వరకు విశ్రాంతి తీసికుని వెళ్ళిపోయా డతను. పొన్న భోజనం చేయమంది కాని అతనంగీకరించ లేదు.

—ఆ ఉదంతం జ్ఞాపకానికి వచ్చినపుడు పొన్నకు అతను వస్తానన్న ధైర్యం కలుగుతూంటుంది. కాని వారం రోజులయినా అతను రాలేదు. సీతాలు కూడ మాట నిలబెట్టుకోలేదు, ఋణం తీర్చుకోనూలేదు.

ఆ రాత్రి భోజనం లేక పోయినా గాలి, వానలో అతడు వచ్చి తన కొడుకుని చూసి వెళ్ళటం సీతాలు మరచిపోగలి గిందా?—అని బాధ పడింది పొన్న. సీతాలిదే కాక అందరిదీ ఒకే ప్రవృత్తి అనిపించింది. పూజారయ్య దేవుడి పేరుచెప్పిడబ్బు గుంజేవాడు. ఆ నాడు మందుల పేరిట కాకపోయినా ప్రజలతన్ని

పోషించారు. అదే విధంగా మందునుచితంగా పుచ్చుకోవచ్చు నన్న అభిప్రాయంతో ఉన్నారు ప్రజలు. డాక్టరుబాబు ఏ దేవుని పేరు చెప్పరు. కనుక ప్రజలు డబ్బునిచ్చే ఆలోచనే చెయ్యరు. రోగాలు తెచ్చుకోవడం వారి వంతు. బాగు చేయటం అతని వంతు—ఇలా తలచుకుంటూంటే పొన్న మనసు అదోలా అయింది. డాక్టరుబాబును కలిసి తన మనసులో ఉన్నది చెప్పాలనుకుంటున్నది. కాని అవకాశం రావటంలేదు.

ఆ నాటికి సంక్రాంతి పది దినాలుంది. డాక్టరు కనిపించి పది దినాలు దాటింది. కాని ఎంతో కాలమైనట్టుందామెకు. కను చీకటి పడేవేళ, నిర్మానుష్యంగా ఉన్న ఆ దాపులో డాక్టరు బాబునే తలుస్తూ బిందెనిండా మంచినీరు ముంచుకుని, చెరువు గట్టెక్కుతోంది పొన్న. ప్రక్క గ్రామంనుండి నడచివస్తున్న డాక్టరు పొన్నను చూచి చెఱువు గట్టు మీదే ఆగిపోయాడు. అతన్ని చూడ గానేఆమె మోము ప్రఫుల్ల మైంది."

"చాల కాలమైం డాక్టరుబాబూ మీరుకనిపించి" అంది సన్నగా నవ్వుతూ పొన్న.

"అవును" అన్నాడు.

"రావాలనే అనిపించ లేదా డాక్టరు బాబూ!" అందిగట్టు మీద ఆగి. అతను ఆగాడు. ఆమెదగ్గరకు రాగానే "రావాలనేఉంది ఎప్పుడు చిరాకుగాఅలసటగా,బాధగా. ఉన్నా,నీవేజ్ఞాపకానికొస్తావు ఓ రెండు క్షణాలు నీతో మాటాడితే బాగుంటుంది, మనసు తేలిక పడుతుంది అనిపిస్తుంది. కాని తీరిక దొరకటంలేదు. నీవు నమ్మవు గాని రెండురోజుల నుండి "పొన్న కనిపిస్తే బాగుండును. అనిపిస్తోంది"

" పోనీ! ఇంటికి ఇప్పుడు రాకూడదూ! కొద్దిసేపు కూర్చుని వెళ్దురుగాని"

"ఎలారాను ఆ కొండదాపున ఇక్కడికి మూడుమైళ్ళలో ఒక కేసు చూచి రావాలి. ఆలస్యం కాకూడదు" అన్నాడు.

"పోనీ అక్కడ ఆ రాళ్ళమీద కూర్చుందాం రండి. నీరు ఎక్కువగా లేదుకూడ. చీకటి పడినా నడిచి రాగలం" అందామె.

ఆ రేవు నుండి కొద్ది దూరంలో చాకిరేవుంది. అక్కడ చాకలాళ్ళ బండరాళ్ళు కూర్చోటానికి అనువుగా కొంత నీటిలోకి దిగి ఉన్నాయి.

నెమ్మదిగా ఇద్దరూ నడచి వెళ్ళారు. ఆమె నడుమునున్న బిందెనందుకుని ప్రక్కనుంచాడు. ఇద్దరూ ప్రకప్రక్కగా రాళ్ళ మీద కూర్చున్నారు. చీర కుచ్చిళ్ళను కొంత పైకి లాగుకుని నీటిలో కాళ్ళుంచి కూర్చుంది పొన్న. కొంతసేపు ఎవరూ మాట్లాడ లేదు. వారి మధ్యనున్న నిశ్శబ్దాన్ని భగ్నపరుస్తూ కొంగల జంట వారి ప్రక్కనుండి నీటిమీదకు ఎగురుకుంటూ పోయింది.

"మీరీ ఊరు విడిచి వెళ్ళిపోండి డాక్టరుబాబూ!"తడబడుతూ అంది పొన్న. ఆ మసక చీకటిలో ఆమెవైపు వింతగా చూశా డతను.

"అవును డాక్టరుబాబూ! మీరీ ఊరిలో ఉండకండి, ఈ ప్రాంతంలో ఉండకండి డాక్టరుబాబూ! మీరు వెళ్ళిపోండి" ఆమె గొంతు బొంగురు పోయింది.

"పొన్నా!"

"డాక్టరుబాబూ! మీరు మంచివారు, మెత్తనివారు. మీరి క్కడ ఉండకూడదు. ఇక్కడి ప్రపంచం మీరనుకునేదికాదు. మీరిక్కడ పగ, ద్వేషం, అసూయ తప్ప మరేమీ చూడలేరు. నేర్చుకోలేరు. సాటి మనిషిని ప్రేమించటం తెలియనివారిమధ్యన మీరుండలేరు. వెళ్ళిపొండి. మీరు తిన్నారో వస్తున్నారో వీరికక్క

రలేదు. నిద్రపోయారా? జాగరం చేశారా? అనికూడా అడగరు. ఇంత ఖరీదైన మందులెక్కడి నుండి వస్తున్నాయని అడగరు. వీళ్ళకు కృతజ్ఞత అంటే ఏమిటో తెలియదు. మీ మంచితనం వీరందరికీ అలవాటయి పోయింది. ఏనాడు మీరు వీళ్ళకు అనుకూలంగా లేకపోయినా మీకు ప్రమాదం తప్పదు. నేర్చుకున్నదిచాలు. మీరిక వెళ్ళిపొండి డాక్టరుబాబూ" అంది పొన్న. ఆమెమాటాడుతుంటే ఆమె కంఠం వణికింది.

"కొంతమందిని చూచి అందరూ అలానే ఉంటారను కోవటం పొరపాటు. నీకు తెలియదుగాని నేచేసిన దానికి ప్రత్యుపకారం చెయ్యాలాని తపనపడే వాళ్ళను చూశాను. వాళ్ళు చేయలేకపోవచ్చు అంతమాత్రాన వాళ్ళు కృతఘ్నులుకారు. నేనిచ్చే మందుల గురించి నీవు బాధపడక్కరలేదు, వాటిని కొనగల స్థోమతనాకుంది. నీవన్నట్టు ఇక్కడి ప్రపంచం నాకర్థం కాక పోలేదు. కాని నాకేమీ కాదు. నన్నెవడూ ఏమీచేయలేడు. నేను ఒకరిని ఆశ్రయించాలని రాలేదు. ఒకరిమీద ఆధారపడాలనీ నాగురించి నీవు చింతించవద్దు. నీలాంటిరాలేదు. ఆత్మీయురాలున్న తరువాత నాకే లోటూలేదు"అన్నాడు.

"కాదుడాక్టరుబాబూ! మీరుండకండి. మీకు తెలియదు. మీరు వెళ్ళిపొండి. వీళ్ళందరికోసం మీరు బాధపడడం నేను చూడలేను" అతనిరెండు చేతులా పట్టుకుని; కన్నీళ్ళను ఆపుకోలేక అతని చేతుల్లో తలవంచుకుని ప్రాధేయపడసాగింది పొన్న.

"మీ కాళ్ళు పట్టుకుంటాను డాక్టరుబాబూ! మీరు వెళ్ళిపొండి.

"పొన్నా .... పొన్నా .... ఏమిటది? లే .... పిచ్చి .... ఏడ్వక .... నాకేమికాదు ........ ఒకసారి తలఎత్తి నావైపుచూడు

....ఛ.... కన్నీరెందుకు .... ఊరుకో పొన్నా ........"ఆమెతల"
వీపు నిమురుతూ ఆమెను శాంతపరుచ జూశాడు. ఆమె అతని కాళ్ళు విడువలేదు. ఆమెలో అజ్ఞాతంగా ఏదో భయమున్నదన్న విషయం అవగతమైందతనికి. ఆమె చేతులను తన చేతుల్లోకి తీసుకుని ఆమెను తన వైపుకు తిప్పుకున్నాడు.

"నా మాట విను పొన్నా! నే వెళ్ళిపోతాను. నే వెళ్ళి పోతాను పొన్నా. కొద్ది రోజుల్లో వెళ్ళిపోతాను. ఇక ఊరుకోవూ" అంటూ కన్నీరు తుడిచాడు.

అతని మాటల్లో నమ్మకాన్ని వెతుకుతూ అతని భుజం మీద తల వాల్చి ఉండిపోయింది. ఆమె చేతులను లాలనగా నిమురుతూ అన్నాడు. "పొన్నా నాకొక సంశయముంది. తీర్చవూ నాకేదైనా అయితే వీళ్ళంతా దిక్కులేని వాళ్ళవుతారని బాధ పడే దానవు. మరి యిప్పుడు నన్ను వెళ్ళిపొమ్మంటున్నావేం పొన్నా?"

పొన్న తల ఎత్తలేదు కాని సమాధానమిచ్చింది.

"చెట్టుకు నీరుపోసి, సంరక్షణ చేసి పువ్వులు కాయలు కోసికోవటం న్యాయం డాక్టరుబాబూ! కానీ నీరు పోయ్యక సంరక్షణ చెయ్యక పువ్వులు, కాయలు కోసికోవటమేగాక, ఆకులు రెమ్మలు తుంచి, కొమ్మను నరికేయటం న్యాయం కాదు డాక్టరుబాబూ. మీ మంచితనం వీళ్ళకు అర్థంకాలేదు, సరికదా మిమ్మల్ని కిరస్తానీ లనీ, ప్రజలనాకట్టుకోవటం కోసం వచ్చిన రాజకీయ నాయకులని శీలం లేని వారని, వీరంతా అనటం నేను సహించలేను డాక్టర్ బాబూ! వీళ్ళన్న మాటే నిజమయితే ఈ చీకటిలో, ఒంటరిగా

మీ సమీపంలో ఉన్న నన్ను మీరేం చెయ్యరేం?....మీ మంచి తనం వీళ్ళకేం తెలును? అసలెలా తెలుస్తుంది? యింకా ఈ ఊరిలో ఉంటారా డాక్టరుబాబూ! చెప్పండి!" అతని రెండు భుజాలను కుదుపుతూ అతని ముఖంలోకి చూస్తూ అంది పొన్న.

తన భుజాలపైనున్న ఆమె చేతులను నెమ్మదిగా తీసివేశాడు. లేచి నిలబడ్డాడు. పొన్న కూడ లేచినిలబడింది. బిందెను నడుమున కందించాడు. అతను మాట్లాడలేదు. నెమ్మదిగా నడిచాడు. ఇద్దరూ చెరువు గట్టు ఎక్కేరు. మౌనంగా ఆమెతో ఊరివరకు వొచ్చాడు.

"వెళ్తాను" అన్నాడు ఆమె చెయ్యిపట్టుకుని.

"డాక్టరుబాబూ! వెళ్ళే ముందు కనపడకుండా వెళ్ళిపోరు కదూ!" వణుకుతున్న గొంతుతో అడిగింది పొన్న. ఆమె కళ్ళలో నీళ్ళున్నాయి.

"కనపడే వెళ్తానులే పొన్నా! చీకటి....దారి చూచుకో.... వెళ్ళు...." అంటూ ఆమెను సాగనంపాడు. ఆమె పొన్న చెట్టు వరకు వెళ్ళేంత వరకు ఆగి వెనుతిరిగాడు.

*  *  *  *

"విన్నావా పోలయ్యా! మీ డాక్టరుబాబు ప్రతాపం" దేవాలయం మంటపం అరుగుమీద భుజంమీద తుండు గుడ్డతో దుమ్ము దులుపుకుని కూర్చుంటూ అన్నాడు రామ్మూర్తి.

"ఊ! ఏదో వార్తతెస్తేనే గాని ఉండలేవు రామ్మూర్తీ—" అన్నాడు నాగన్న.

"ఊ! ఊ:! ఏదో కథే!!!....చెప్పు రామ్మూర్తి ఏమిటి కథ?" అన్నాడు రామప్ప.

"అందరికీ తెలిసిన కథేనయ్యా! కాకపోతే మనకే., ఆలస్యంగా తెలుస్తా. మన డాక్టరుబాబు గోపికాలోలుడయ్యాడుకదూ!" అన్నాడు రామ్మూర్తి.

"ఎవరా గోపిక? సొంతం చెప్పు" అన్నాడు శివయ్య ముక్కుపొడుం పట్టబోయి. రామ్మూర్తి ప్రారంభించాడు. "ఇంకెవరు? ఆ గొల్లది. మొగుడ్ని విడిచిన పొన్నమ్మ. రాత్రి పగలు దానింటిలోనేనట వాడి మకాము. కూడు,కుమ్ము అక్కడేనట. పాలు పెరుగు పెట్టి పోషిస్తోంది వాడిని. వాడు రాకపోతే అదే రాత్రి అక్కడికి పోతుందట. చాలసార్లు వాడింటిలో కనిపించిందట ఆ ఊరివాళ్ళకి. మొన్న చెరువు గట్టున రాత్రివేళ ఇద్దరూ సరసాలాడుకోవటం శోభనాచలం తమ్ముడు సిమ్మాద్రి చూశాడట ఊరంతా ఒకటే గోలకదయ్యా!" వీలయినంత తొందరలో అంతా చెప్పేశాడు.

"అవునయ్యా! దొరికి దొరికి దానికి వాడే దొరకాలా? ఊరంతా గొడ్డు పోయిందటయ్యా! ఎంత ఉంచుకున్నా జాతి అక్కరలేదు?" అన్నాడు శివయ్య.

"అవును లేవయ్యా! ఊరంతా దాన్ని చూచి నోరు చప్పరించారేగాని ఒక్కడు? ఏదీ ఒక్కడు....మగతనంతో చెయ్యిపట్టుకోగలగాడయ్యా? ఊరి కొచ్చి సంవత్సరం కాలేదు. వాడి చెయ్యిపడని ఆడది లేదు. చూపుపడని చిన్నది లేదు, ఏమన్నా అంటే డాక్టరు. వాడి మందే మందు. ఊరికి బుద్ధిలేక పోయిన తరువాత బాహాటంగా సరసాలు మొదలు పెట్టక ఊరుకుంటాడటయ్యా!" తన కసినంతా తీర్చుకున్నాడు రామప్ప.

"ఎంత బాపనాడివైనా తొందరపాటుకూడదయ్యా! అప్పుడే అంతా అయిపోయినట్టుమాట్లాడతావేమిటి? అసలు కథ ఇప్పుడే

కదా మొదలవుత?" అంటూ అందరికి దగ్గరగా జరిగాడు పోలయ్య "దాని మొగుడు విన్నాడు. వాడేకాదు. దాని మరదు లూనూ నేడో రేపో వాడిమీద విరుచుక పడదుటయ్యా!" అని అన్నాడు.

"వాళ్ళు కాకపోతే మనం. వీడి ఆటలు సాగుతే సంసారు లేమైపోవాలి" బాధ పడ్డాడు శివయ్య.

"అదీ కథ! అంటూ అందరికీ దగ్గరగా జరిగాడు పోలయ్య. అతనేదో రహస్యంగా చెప్పడంతో అందరూ అతనికే చెప్పలనందిం చారు. ఆలయం మండపం మీద కాకులు నలుదిశలా చెదిరి పోయాయి.

* * *

రెండు రోజుల నుండి పొన్న మనసు మనసులో లేదు. వీధి వంక చూడలేక పోతోంది. నలుగురి ముఖం చూడలేక పోతోంది. ఇంటి ముందు నుండి నడిచే జనంకూడా ఇంటిలోకి చూపులు విసిరి మరీ పోతున్నారు. సీతాలు మాటలు ఆమె మరచి పోలేక పోతోంది. "మొగుడ్ని విడిచిన దానవు....అతనితో వుంటు న్నావట....చెరువు గట్టున సరాగాలట....రాత్రి పగలూ నీ మకాం అక్కడేనట....అతని కోసం ఎంత రాత్రయినా పోతావట.... నిజంగా అతనంటే నీ కంత మనసా?......."

కన్నీరువచ్చింది పొన్నకు. ఆ రోజు భోజనం సహించలేదు. నిద్రరాలేదు. రెండు రోజులుగా అదే పరిస్థితి.

ఆ రోజు కూడ భోజనం సహించలేదు. మర్నాడే భోగి కాని మనసు మనసులోలేదు. గడపలకు పసుపు రాయులేదు. బొట్లు పెట్ట

లేదు. నున్నటి జేగూరు రంగు గచ్చు మీద అందమైన ముగ్గులు వేయలేదు. గడపలకు బంతి పూ తోరణాలు కట్టలేదు. ఏ పనీ చేయ మనసు రాలేదు. అది కృష్ణ పక్షం. ఆమె మనసులోలాగే ఊరంతా చిక్కని చీకటి. రాత్రి పది వరకు కరివేపాకు చెట్టు కింద పడు కున్నది. కాని నిదుర రాలేదు. చలిగాలి రివ్వున వీస్తూంటే ఇంట్లోకి వచ్చి పడుకు వాల్చింది. కాని నిద్ర రాలేదు. అంతలో తలుపు చప్పుడయింది. పాలు, పెరుగు కోసం ఎవరు వచ్చినా పిలుస్తారు తప్ప తలుపు తట్టరు. డాక్టరుబాబు అవతాడన్న నమ్మకం ఆమెకు లేదు. మళ్ళా ఎవరో తలుపు గట్టిగా బాదారు. ఏదో సంకోచంతో తలుపు తీసింది. ఎదురుగా కనకరాజు "నువ్వా!" అంది కంపిత స్వరంతో.

"అవును నేనే! ఏం? పేరు చెప్పాలా! గడపలో నిలబెట్టావు? కనకరాజునే నేను, నీ మొగుణ్ని" మీసం మీద చెయ్యివేసి అన్నాడు.

"హూ! మొగుడు. కాపరం చెయ్యడాని కొచ్చావా కనక రాజు మొగుడా! రాత్రివేళతప్ప పగటివేళ నీకు తీరికదొరక లేదా?"

"హూ! కాపురం చెయ్యటానికి కాదే కాపురానికి తీసికెడదా మని వచ్చాను. డాక్టరు గాడి సంగతేమిటో తేల్చుకుందామని వచ్చాను." లోపలికి అడుగు వెయ్యబోయాడు. కాని పొన్న దారివ్వ లేదు. పొన్న అంది "డాక్టరుబాబు సంగతేమోగాని, నీతో అంత సులభంగా రాలేను కనకరాజు బావా! పంచాయతీ పెట్టించు నేను నీ భార్యనని ఒప్పుకో నేను నిన్ను ఒదిలిపెట్టింది అబద్ధమని అందరికీ చెప్పు. నా తల్లిని చంపింది నీవేనని అందరి ముందు ఒప్పుకో. డబ్బుకి గడ్డి కరచి నన్ను, అమ్మను యింటి నుంచి

తరిమిన రాత్రి గుర్తు రాలేదా? నా మీద లేనిపోని నిందలు మోపి నప్పుడు గుర్తురాలేదా? ఇప్పుడు నీ భార్య నయ్యానా? నన్ను విడిచి పెట్టింది నా భార్యని గర్వంగా చెప్పుకున్న మగాడివి, సిగ్గు లేక కాపురానికి పిలువ వచ్చావా? నీ అవసరం తీర్చుకుందామని వచ్చావా? బయటికి నడువు."

అతని కళ్ళలో కెంపులు మెరిశాయి. అవమానాన్ని నిగ్రహించుకో లేక పోతున్నాడు. కాని నిలదొక్కు కున్నాడు. పళ్ళు పటపట కొరికాడు. "నేను నీ భర్తను కానన్నా, నీవు నా భార్యవు కానన్నా, నేను నీ కులపోడినే నేను నీ డాక్టరుకన్నా బలవంతుడ్ని. అందగాడిని. ఊరుకాని వాడిని పంచన జేర్చావు. నేను నీకు కాక పోయానా?"

"ఎవరైనా కావచ్చు. కానినీవు కుక్కవి. అందుకే నీ బుద్ధి చూపించావు. నాతో వాదన పెంచకు. డాక్టరుబాబు పేరు మననం చెయ్యకు వెళ్ళు" నిశ్చేష్టుడైన కనకరాజును నెట్టి తలుపు మూసేసింది పొన్న.

కనకరాజులో రౌద్రం రగిలి ఉంటుంది. తిట్టుకుంటూ "నిన్నూ, నీడాక్టరుని ఏం చేస్తానో చూడు" అంటూ తలుపును నాలుగుసార్లు బాది వెళ్ళిపోయాడు కనకరాజు. కనకరాజు బెదిరింపులు మనసులో తిరుగాడుతూండగా చాలవరకు నిద్రరాలేదు పొన్నకు.

* * * *

చిక్కని చీకటి. రాత్రి పన్నెండు గంటల వేళ. చీకటిని చీల్చుకుంటూ టార్చి—టార్చిని పట్టుకుని డాక్టరుబాబు—అతని వెనుక నలుగురు మనుషులు.

పద్మాపురాని దగ్గర చెరువు గట్టుమీది జువ్విచెట్టు దగ్గరకు వచ్చారు. "ఆగండి డాక్టరుబాబూ!" ఆ నలుగురిలో ఒకరన్నారు. వెను తిరిగాడు డాక్టరు "ఎందుకు?" అడిగాడు.

"మనం యిక ముందుకి పోనక్కరలేదు" అన్నాడొకతను.

"అదేం! మీ ఊరికి మైలు దూరంలో రోగి వున్నాడంటివిగా రోగి అక్కడ లేడా?"

"అక్కడ లేడు డాక్టరుబాబూ! ఇక్కడే వున్నాడు" అంటూ ముగ్గురు దగ్గరకొచ్చారు. రెండు చేతులు బిగించి పట్టుకున్నారు. అతను గింజుకుంటుంటే జువ్విచెట్టు దగ్గరని లాక్కెళ్లారు. అంతకు ముందు దాచి వుంచిన త్రాళ్ళతో అతనిని చెట్టుకు కట్టేశారు. జువ్వి చెట్టు చుట్టులనందుకున్నారు.

"అక్రమం! అన్యాయం!! మోసం!!!" అరిచాడు డాక్టరు.

నవ్వాడు కనకరాజు "అది కనుక్కుందామనే వచ్చాం. ఏ ఊరు నీది? ఎందుకొచ్చావిక్కడికి?" అడిగాడు.

"నీవు క్రొత్తగా వచ్చావా యిక్కడికి? నేనెందుకొచ్చానో అందరికీ తెలుసు. నీకు చెప్పనక్కరలేదు." గింజుకుంటూ అన్నాడు డాక్టరు.

"పోనీ చెప్పకు. పొన్న ఎవరో తెలుసా?"

"తెలుసు. ఆమె దేవత."

"కాదు దయ్యం. ఆమె సంగతి మరచిపో. ఊరు విడిచి వెళ్ళిపో!"

"ఆ సంగతి చెప్పడానికి నీ వెవరివి?"

"నీ పాలిటి యముణ్ణి." హూంకరించాడు కనకరాజు.

"అదినీ యిష్టం కాదు. ఈ ఊరిలో ఉండటానికి అందరిలా నాకూ స్వేచ్ఛ ఉంది."

"ఉంటుంది. ఉంటుంది." అంటూ చువ్వలతోనూ, త్రాళ్ళతోనూ కసిదీర బాదారు నలుగురు.

చేతులు అలసిన తరువాత "రేపుదయం; నీలాటి రేవుకొచ్చే ఆడంగుల ముఖాలచూచి యింటికెళ్ళువుగాని" అంటూ చీకటిలో తన్ని వదలి నలుగురు పద్మాపురం వైపు కదలిపోయారు. అతనికి స్పృహ తప్పిన విషయంవారు గమనించలేదు

× × ×

భోగిమంటలు వీధుల్లో మండుతున్న వేళ తెల్లవారు ఝామున వేణు పిలుపు విని కరణంగారింటికి పరుగెత్తింది పొన్న.

మంచం మీద కమిలిపోయిన శరీరంతో పడి ఉన్నాడు. అతనిని చూడగానే ఆమె కళ్ళు తిరిగాయి. "డాక్టరుబాబూ!" అంటూ కాళ్ళమీదపడి ఏడ్వసాగింది. చుట్టూ ఉన్న జనం గురించి ఆలోచించే పరిస్థితిలో లేదామె. కరణంగారి భార్య, పంతులుగారి కోడలు అమెను ప్రక్కకు తీసుకునివెళ్ళి "అతనికేమీ ఫరవాలేదు" అని శతవిధాల బోధపరచిన తరువాత దుఃఖాన్ని కొంత మింగుకొని గోడప్రక్కకువెళ్ళి ఏడ్వసాగింది పొన్న.

వేణు డాక్టరుకోసం పట్నంపరుగెత్తాడు. పంతులుగారి తండ్రి దెబ్బలకు ఆకు పసర్లు పట్టించాడు. డాక్టరుబాబు మూలుగుతున్నాడేగాని కళ్ళుతెరచి చూడలేదు. కుమిలిపోసాగింది పొన్న. కరణంగారు నెమ్మదిగా ఆమె దగ్గరకెళ్ళారు. "పొన్నా! ఇదంతా ఎవరివల్ల వచ్చిందో తెలుసా?" అడిగారు. ఆమె సమాధానాన్ని ఊహించేలోగా అతనే అన్నాడు. "నీవల్లే!"

అయోమయంగా చూచింది పొన్న.

"నీవు అతని సమీపానికి వెళ్ళకండా వుంటే ఇంత జరిగేదికాదు. నిన్ను తప్పుగా అర్థంచేసుకుని నేననటంలేదు. ఊరంతా చెవులు కొరుక్కుంటున్నా, నీ మీదనాకు నమ్మకముంది. నాకొడుకుని రక్షించిన డాక్టరుదేవుడు, అతనిఎదుటనీవు హారతివి. అతని మెడలో మాలికవు. వేణుకి ఆశ్రయమిచ్చిననాడే తెలిసి. డాక్టర్ని అర్థంచేసికున్నది నీఒక్కర్తివేఅని. నేనతన్ని చాలా ఆలస్యంగా తెలుసుకున్నాను. ఇక అతనికి ఏలోపమూరాదు. నేనతన్ని నాకన్న కొడుకులా చూచుకుంటాను. బాధపడకు" అన్నాడాయన లాలనగా. పొన్నకు దుఃఖం ఆగలేదు, పెరటిలో బంతిచెట్లమధ్య బండరాతిమీద కూర్చుని కుమిలి కుమిలి ఏడ్వసాగింది పొన్న.

పదిగంటల వేళ వీధిలో కారాగింది. వేణుతోపాటు డాక్టరు దిగాడు. మంచంమీదున్న డాక్టరుబాబునుచూస్తూ "ఇతను.... ఇతను .... శేఖరే - మా బంధువు .... శేఖర్! నీకేనా ఈ శిక్షపడింది? .... ప్రజాసేవ చేస్తానని వెళ్ళిపోయావని. అన్నారే మీ ఊళ్ళో. నీవు.యిక్కడికా వచ్చింది .... " అంటూబాధ పడ్డాడు. శేఖర్ని పరీక్షిస్తునేవున్నాడు. "ఇతనుచాలా మంచికుర్రవాడు. ఇంతమంచివాడిని, ఎవరు ఎందుకు యింతలా హింసించారో నాకు తెలియదు, కాని ఈ ఘోరాన్ని చేసినవారెవరో - ఎవరైనాసరే తెలిసికుని తీర్తాను. వాళ్ళు మాత్రం శిక్షను తప్పించుకో లేరు" అన్నాడతను పెదవులు బిగపట్టి శేఖర్ జబ్బ మీద ఇంజక్షన్ యిస్తూ.

"శిక్షను తప్పు చేసినవాడెవడూ తప్పించుకో లేడు డాక్టరుగారూ. నేరస్తుణ్ణి పట్టి ఒప్పగిస్తాం. మా డాక్టరును బ్రతికించి మాకు ఒప్పచెప్పండి." అన్నాడు కరణం.

కొద్దిసేపు మౌనంగా వుండి అన్నాడతను "ఇతన్ని నాతో తీసికెడుతున్నాను. ఇతను తేరుకున్న తరువాత ఇతన్ని ఇంటికి పంపిస్తాను. ఇతను మరి యిక్కడకు రాడు నేను రానివ్వను.

కరణంగారికి మాట రాలేదు. పొన్న డాక్టరుకు దగ్గరగా వచ్చి నిలుచుంది. ఆమెను డాక్టరుకెలా పరిచయం చేయాలో అతనికి తెలియలేదు. డాక్టరు కూడా ఆమెను గమనించలేదు.

"డాక్టరుగారూ! మీరు మీ యిష్టం వచ్చినట్టు చెయ్యండి. కాని ఒక ప్రార్థన ఇక్కడనుండి తీసుకు వెళ్ళేలోగా ఒక్కసారి కళ్ళు తెరచి చూస్తే మాకందరికీ తృప్తి. చూడండి ఎంత మంది అతనిని చూడాలని తహతహలాడుతున్నారో. తమకు సేవచేసిన డాక్టరేమైపోతాడో అని వీరిబాధ" అన్నారు కరణంగారు అందర్నీ చూస్తూ.

"నా ప్రయత్నం నేను చేస్తున్నాను.-ఈలోపుగా ఎవరినైనా పంపి అతని సామాను తెప్పించండి. నా కారును తీసికెళ్ళమనండి" అన్నాడు డాక్టరు. వేణు ముందుకి పరుగెత్తాడు. డాక్టరు మరో యింజక్షన్ యిచ్చాడు.

కారు రాకకు కొద్దిగ ముందుగా శేఖర్ సల చేతులు కదల్చాడు. అతని పెదవులు కదిలాయి. "పొన్నా! డాక్టరుబాబు మాటాడుతున్నాడు. రా! పొన్నా! రా!" అంటూ కేకేసి పిలిచారు కరణంగారు. పొన్న పేరు విని కాబోలు శేఖర్ కళ్ళెత్తి చూశాడు. పొన్న అతని ముందుకు పరుగెత్తుకుని వెళ్ళి మంచం ప్రక్కన కూలబడి రెండు చేతులు జోడించి "డాక్టరుబాబూ!" అంది కన్నీరు నిండిన కళ్ళతో అతన్ని చూస్తూ.

అతను పొన్నను చూచి

"వెళ్ళి....పొమ్మన్నావుగా .... పొన్నా! ... వెళ్ళి....పోతు న్నానులే...." అంటూ చేతిని బహుశా ఆమె కన్నీరు తుడవటం కోసం కాబోలు ఎత్తి మరిలే ఎత్త లేక వదిలేశాడు, చేయిజారి పోయింది. తల ప్రక్కకు తిప్పుకున్నాడు. కనులు మూతపడ్డాయి. పేణు వచ్చాడు. మూలుగుతున్న శేఖర్‌నికారులో పడుకోపెట్టారు.

కారు కదల బోతూంటే "వెళ్ళిపోకండి డాక్టరుబాబూ....ఇలా వెళ్ళిపోకండి....తిరిగిరండి డాక్టరుబాబూ, తిరిగిరండి" అంటూ ముందుకు పరుగెత్తింది పొన్న. ఆమెను పంతులుగారితల్లి,కోడలు పట్టుకున్నారు. కారు కదలి పోయింది. పొన్న వారిపట్టును తప్పించు కుని ముందుకు పరుగెత్తింది. "డాక్టరుబాబుని బ్రతికించమని చెప్పండి" అంటూ ఆమెను అడ్డుకున్న వాండరికి చెప్పుకుని వారి పట్టు వదిలించుకుని ముందుకు పోయింది. ఆమె నెవరూ ఆపలేక పోయారు. కారు ఎంత దూరం పరుగెత్తినదీ ఆమెకు తెలియదు. కాని అతని ఆరోగ్యం ఏమవుతుందన్న ఆవేదన, అతనెక్కడికెలు న్నాడో తెలిసికోవాలన్న! చింత ఆమెలో వున్న సంగతి ఎవరికీ తెలియదు. ఏదో ఒక భ్రాంతి, ఒక ఆశ ఆమెను నడిపించాయి. నల్లని కారు నందుకోవాలన్నఆశతో ఆమె మెరుపులాపరుగెత్తింది.

దారిప్రక్కన ఎండలో మండుతున్న కర్రదుంగల మంటలు స్పష్టముగా ఎవరికీ కనిపించటం లేదు.

కాకులు ఆమెను చూస్తూ ఉండిపోయాయి.

ఆమె రోడ్డును వదలి చేలకు అడ్డంగా నేలబావులనుతప్పించు కుంటూ పరుగెత్తింది. చేనుమధ్యలో కుడిఅరికాలిలో ఏదో బలంగా దిగింది. బాధ గుండెలో కలుక్కుమంది. ఎండ నెత్తినిమొత్తు తోంది. రక్తం తడిసిన ఆ చోట ఆమె నిలువలేక పోయింది. కళ్ళు తిరిగాయి. స్పృహ తప్పి ఆమెఅక్కడేపడి పోయింది.

కారు మలుపు తిరిగింది.